వీక్షణం

Veekshanam

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 11 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | ఏప్రిల్ 16-30, 2004

లోపలి పేజీల్లో...

విడి ప్రతి : రూ॥ 6/-
వార్షిక చందా : రూ॥140/-లు

సంపాదకీయం:

తొలివిడత - ప్రజాస్వామ్య స్ఫూర్తి

ఎన్నికలు స్వేచ్ఛగా సవ్యంగా ప్రజాభిమతానికి అద్దం పట్టేలా నిర్వహించబడడం ప్రజాస్వామిక పాలనకు ఒక షరతు. ఆ లెక్కన 2004 సార్వత్రిక ఎన్నికల మొదటి విడతను పరిశీలిస్తే ప్రజాస్వామ్యానికి ఈ ఎన్నికలకు ఏమీ సంబంధం లేదనిపిస్తుంది. ఇది రాసే సమయానికి ఇంకా మూడు విడతల ఎన్నికలు జరగవలసి ఉండగా, మొదటి విడత జరిగిన ఎన్నికలలోనే దేశ వ్యాప్తంగా హింసా దౌర్జన్యాలు చెలరేగాయి. మద్యం, డబ్బు, కుల, మత, ప్రాంత విద్వేషాలు ఓటర్ల మనోభావాన్ని ప్రభావితం చేసేందుకు పెద్ద ఎత్తున వినియోగించబడ్డాయి. అన్ని రాజకీయ పార్టీలు ఎటువంటి మినహాయింపులు లేకుండా ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం ద్వారా, డబ్బు ద్వారా ఓట్లు కొనుక్కోవడానికి ప్రయత్నించాయి.

ఈ గందరగోళం మధ్య గుర్తించవలసిన అంశాలు రెండు మూడున్నాయి. మొదటిది, ప్రభుత్వం పోలీసులు ఈ ఎన్నికల్లో నక్సలైట్లు భారీ హింసకు పాల్పడతారని చేసిన ఊహాగానాలు తప్పని తేలడం. నక్సలైట్ల హింసను బూచిగా చూపి కేంద్రం నుంచి అదనపు బలగాలను తెచ్చుకొని రాష్ట్రంలో ఎన్నికలను రెండు విడతలుగా విభజించి ఉత్తరాంధ్ర, తెలంగాణాలో వేలాదిమంది పోలీసులను మోహరించారు. ఈ మోహరింపుకంతా కారణంగా చూపిన నక్సలైట్ల ఎన్నికల వ్యతిరేక కార్యక్రమాలు ముఖ్యంగా ఎన్నికలను అడ్డుకునే కార్యక్రమాలు దాదాపుగా జరగనేలేదు. మరొక వంక అన్ని పార్లమెంటు పార్టీలు ఏదో ఒక నియోజకవర్గంలో విచ్చలవిడి హింసకు పాల్పడ్డాయి. నక్సలైట్లు హింసావాదులని తాము అహింసా వాదులమని పార్లమెంటులో రాజకీయ పార్టీలు చేసే వాదనలలో వాస్తవేమిటో ఈ ఎన్నికలు ప్రకటించాయి.

ఈ ఎన్నికల్లో మరొక అంశం, ఇవి కోటీశ్వరులకు మాత్రమే సంబంధించినవన్నది. ఎన్నికల నిబంధనావళి ఏమి చెప్పినా, ఏ అసెంబ్లీ అభ్యర్థి కోటి రూపాయలకు తక్కువ ఖర్చు పెట్టలేదని ప్రచారార్భాటం చూపుతోంది. అంటే ఈ ఎన్నికల ప్రక్రియ సంపన్నుల ప్రయోజనాల కోసం సంపన్నులు మాత్రమే పాల్గొనే భారీ డబ్బుల క్రీడ అని, ఈ ఎన్నికలు మరోసారి రుజువు చేశాయి.

ఈ ఎన్నికలు నిజమైన ప్రజాభిప్రాయాన్ని ప్రకటించడం లేదని వాదించే వాళ్ళక్కూడా ఆశ్చర్యం గొలిపే చిహ్నాలు కొన్ని మొదటి విడతలో బయటపడ్డాయి. ఓటర్లు తమ ముందుకొచ్చి ప్రలోభాలకు లొంగకుండా ఓట్లు వేసిన ఉదంతాలు ఎన్నో వున్నాయి. పాలకపక్షం విచ్చలవిడిగా పంచిన డబ్బులకు, పోయించిన సారాకు, ప్రచారం చేసిన అబద్ధాలను కూడా అధిగమించి చాలా చోట్ల ఓటర్లు తమ ప్రభుత్వ వ్యతిరేకత ప్రకటించారని తొలి వార్తలు తెలుపుతున్నాయి. ఇది ఒక రకంగా 1977 ఎన్నికల ఉదాహరణను పునరావృతం చేసింది. నిరంతర జాగరూకతే ప్రజాస్వామ్యానికి ముఖ్యం అన్న మాట ఈ రకంగా రుజువు కావడం అభినందనీయం.

పట్టిక 2: జనాభాలో ప్రాథమిక విద్య పొందిన వాళ్ల శాతం

దేశం లేదా రాష్ట్రం పేరు	ప్రాథమిక విద్య
మలేషియా	99.9
ఫిలిప్పైన్	99.9
శ్రీలంక	99.9
ఇండియా	77.2
ఆంధ్రప్రదేశ్	61.6 (అక్షరాస్యత)

మూలం: మానవ అభివృద్ధి నివేదిక 1999
వార్త ఏప్రిల్ 5, 2004

పట్టిక 3: ఉన్నత విద్యారంగంలో సంబంధిత వయస్సు గ్రూపులో **(17-23)** ఎన్‌రోల్‌మెంట్

దేశం పేరు	శాతం
అమెరికా	80.9
బ్రిటన్	52.3
ఆస్ట్రేలియా	79.8
న్యూజిలాండ్	62.6
ఇండియా	7
ఆంధ్రప్రదేశ్	6.7

మూలం: యునెస్కో డాక్యుమెంట్

డ్రాపవుట్, నమోదు చేయించుకోకపోవడానికి కారణాలు (కుటుంబాల శాతం)

తరగతి	దారిద్ర్యం	పని చేయడం	ఇంటి పని	ఆసక్తి లేమి	స్కూలు సమస్యలు	ఇతరం
బాలురు						
అభివృద్ధి చెందిన	37	41	04	14	02	02
వెనుకబడిన	41	24	07	18	07	03
మొత్తం	39	35	05	15	04	03
బాలికలు						
అభివృద్ధి చెందిన	23	31	16	22	05	03
వెనుకబడిన	23	10	15	31	00	21
మొత్తం	23	21	16	25	03	12

స్కూళ్ళ సాంద్రత, వాటి పరిధిలో ఉన్న విస్తీర్ణం, ప్రాంతాల వారీగా **(1999-2000)**

ప్రాంతం	స్కూలు సాంద్రత పరిధిలో ఉన్న విస్తీర్ణం					
	ప్రతి **1000** చ.కి.మీ.కు	ప్రతి లక్ష పిల్లలు **(6-11)**	పరిధిలో విస్తీర్ణం చ.కి.మి.	పిల్లలు	ప్రైవేటు స్కూళ్ళ వాటా	మొత్తం స్కూళ్ళు
కోస్తా ఆంధ్ర	298	608	3.6	178	8.8	25287
రాయలసీమ	187	689	6.1	161	4.5	12317
తెలంగాణా	155	437	6.0	228	2.8	17794

మూలం : విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి-టీచర్ నిష్పత్తి

ప్రాంతం/ సంవత్సరం	**1981**	**1991**	**2001**	మార్పు శాతం **1981-91**	**1991-01**
కోస్తాఆంధ్ర	37.5	56.3	44.0	50.1	-21.8
రాయలసీమ	33.4	49.7	46.6	48.8	-6.2
తెలంగాణా	23.0	48.5	50.6	110.9	4.3
ఆంధ్రప్రదేశ్	27.5	51.9	46.5	88.7	-10.4
భారతదేశ మొత్తం మీద	54.0	59.4	58.8	10.0	-

వివిధ విద్యార్హతలతో నమోదైన నిరుద్యోగుల సంఖ్య మరియు ఉద్యోగాలు పొందిన వారి వివరాలు **(31-10-1999 నాటికి)**

విద్యార్హత	నమోదైన అభ్యర్థుల సంఖ్య	లభించిన ఉద్యోగాల సంఖ్య
బి.ఇ. (సివిల్)	5500	1
బి.ఇ. (మెకానికల్)	4720	0
బి.ఇ. (ఎలక్ట్రికల్)	974	0
బి.ఇ. (ఎలక్ట్రానిక్స్)	2090	0
బి.ఇ. (ఇతరులు)	5259	2
మెడికల్ గ్రాడ్యుయేట్స్	2495	8
అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్స్	2238	2
వెటర్నరీ గ్రాడ్యుయేట్స్	171	106
పోస్ట్ గ్రాడ్యుయేట్స్	16347	18
గ్రాడ్యుయేట్స్	3,22,652	163
మెట్రిక్యులర్స్	10,21,282	1392
ఇంటర్మీడియెట్	4,48,600	513
ఎ) ఎల్‌సిఇ	17,883	49
బి) ఎల్ఎంఇ	22,766	10
సి) ఎల్ఇఇ	8020	14
డి) ఇతరులు	36,359	216
ఐటిఐ	2,50,448	297
బిఇడి	1,05,974	2680
ఎస్‌జిబిటి (టిటిసి)	22,909	1069
స్టెనోగ్రాఫర్స్	22,422	32
టైపిస్ట్స్	2,45,834	135
ఇతర విద్యార్హతలు	1,31,167	1811
అన్‌స్కిల్డ్	3,77,964	1870

కంపెనీ లాభాలపై ప్రభావం చూపని కరువులూ, వరదలు

కరువు, వరదలు ఏమొచ్చినా సరే, కంపెనీలు మాత్రం లాభాలు చేసుకోవటం మాత్రం ఆగిపోదు. అందుకనే పరిశ్రమలు ఖాయిలాపడవచ్చుగాని, పారిశ్రామికవేత్తలు కాదని అంటుంటారు. కరువు వచ్చినపుడు, ప్రజల చేతుల్లో డబ్బు వుండదు కాబట్టి, పరిశ్రమ ఉత్పత్తులకు గిరాకీ వుండదు. వాళ్ళకు అమ్మకాలుండవు, పరిశ్రమలే ఉత్పత్తిని తగ్గిస్తాయి లాంటి పడికట్టు అంచనాలుంటాయి. కాని దేశమంతటా వర్షాభావం వల్ల కరువు పరిస్థితులేర్పడిన 2002-03 సంవత్సరంలో, అంతకుముందు సంవత్సరంలో -8.3 శాతం నష్టంతో పోలిస్తే 48.1 శాతం లాభం చేసుకొన్నాయని 997 పెద్ద ప్రభుత్వేతర, నాన్-ఫైనాన్షియల్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలను అధ్యయనం చేసిన రిజర్వుబ్యాంకు తెలియచేస్తోంది. 2001-02, 2002-03 సంవత్సరాలో ఈ కంపెనీలన్నీ ఎలా పని చేశాయో, ఈ దిగువ పట్టిక చూడండి.

పెరుగుదల రేట్లు		
	2001-02	2002-03
అమ్మకాలు	-1.2	9.7
ఉత్పత్తి విలువ	-1.6	11.8
ఉత్పత్తి ఖర్చులు	-7.4	14.7
స్థూల లాభం	7.6	6.5
వడ్డీ	-1.6	-13.0
పన్నులు చెల్లించకముందే లాభం	-3.9	42.7
పన్ను చెల్లింపులు	8.1	30.3
పన్ను చెల్లించిన తర్వాత లాభం	-8.3	48.1
డివిడెండ్లు	16.2	10.2
ఉంచుకొన్న లాభాలు	-27.4	95.6

(రిజర్వ్ బ్యాంకు బులెటెన్ ఏప్రిల్ 2004)

ఈ కంపెనీలకు అమ్మకాల వల్ల వచ్చిన ఆదాయం 02-03లో రు.2.59 లక్షల కోట్లు (మన రాష్ట్ర బడ్జెట్ రు.40 వేల కోట్లు); మొత్తం ఆదాయం 12.2 శాతం పెరిగింది. జీతాలు, బోనస్‌లు మాత్రం 11.4 శాతం నుండి 10.8 శాతానికి తగ్గాయి. వడ్డీరేట్లు తగ్గించటం వల్ల 13 శాతం మేరకు భారం తగ్గింది. ముడి సరుకు, యంత్రాల దిగుమతులు పెరిగాయి. విదేశీ నిధులు కూడా పెరిగాయి. కంపెనీల నికర ఆస్తులు 6.1 శాతం పెరిగాయి.

స్థూల లాభాల లెక్కలు చూస్తే అంతకుముందు సంవత్సరం కన్నా 02-03లో రేడియో, టీవీ, ఇతర కమ్యూనికేషన్ యంత్రాల లాభాలు 283.6 శాతం, నూలు వస్త్రాలు 137.7 శాతం, బేసిక్ రసాయనాలు 63.9 శాతం మెషినరీ, మెషిన్ టూల్స్ 50.4 శాతం ఎక్కువ లాభాలు చేసుకొన్నాయి. కన్స్యూమరిజం పెరుగుతుందనడానికి ఈ లాభాలు ఒక నిదర్శనం. అదే సమయంలో జీతాలు బోనస్‌ల మీద ఖర్చు 01-02లో మొత్తం ఖర్చులో 6.61 శాతం నుంచి 02-03లో 6.12 శాతానికి తగ్గిపోయింది.

× × × ×

ఇంకో రెండు నెలల్లో దేశంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఇప్పటి ప్రభుత్వం కొనసాగనూవచ్చు, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడనూ వచ్చు. ఎన్నికల్లో చేసిన బాసలు ఎలా తీరుస్తారనే విషయం అలా వుంచితే, ఈసారి రుతుపవనాలు మామూలుగా వుంటాయని వాతావరణ శాస్త్రజ్ఞులు హామీ ఇస్తున్నా, మరీ అంత భరోసా పనికిరాదని మన అనుభవం మనకు చెబుతుంది. రుతుపవనాలు బాగానే ప్రారంభం అయి ఆ తర్వాత ఫెయిల్ కావచ్చు. అలాగే దేశమంతటా ఒకే విధంగా, అన్ని రాష్ట్రాల్లోనూ వర్షాలు సకాలంలో పడకపోవచ్చు. వ్యవసాయమే మన దేశ ఆర్థిక పరిస్థితిని గట్టెక్కించిందని ఇది వరకు ఎన్నోసార్లు రుజువైంది. 03-04 సంవత్సరం అదే విషయాన్ని పునరుద్ఘాటించింది. వ్యవసాయం పుంజుకోవడంతో, మొత్తం ఆర్థిక పరిస్థితి కాస్త ఊపిరి పీల్చుకొంది. 03-04 సంవత్సరంలో కూడా మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో సరిగ్గా వర్షాలు కురవక పంట నష్టపోయిన విషయం గుర్తుంచుకోవాలి. కొత్తగా ఏర్పడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేడుకలు, వినోదాల్లో కొట్టుకుపోకుండా, పరిపాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంపై దృష్టి సారించాలి. దురదృష్టవశాత్తు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోతే నష్టపోయేది సన్న, చిన్నకారు రైతులే.

– విహారి

అధికారంలోకి వస్తే కాంగ్రెస్ కూటమి మాట నిలబెట్టుకోవాలి

నక్సల్స్ సమస్య పరిష్కారంలో అణచివేత విధానాలు సరిపోవని, అది అసలు పరిష్కారం కాదనీ గడచిన చరిత్రంతా తేల్చి చెప్పింది. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ చంద్రబాబూ నాయుడు అదే అణచివేతపై ఆధారపడి, దానిని మరింత పెంచడమే ఏకైక పరిష్కారంగా ఎన్నికలలో ప్రచారం చేస్తున్నారు. ఈ రకంగా, ఒకవేళ తెలుగుదేశం తిరిగి ఎన్నికల్లో గెలిస్తే ఈ హింసా, ప్రతిహింసా వలయం నుండి రాష్ట్రం తప్పించుకునే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది. తెలుగుదేశం ఎజెండాకు ప్రతిస్పందనగా పీపుల్స్‌వార్ తెలుగుదేశంతో పాటు మిత్రపక్షమైన బి.జె.పి. పై దాడులు ప్రారంభించింది. ఏ మాత్రం వెనుకకు తగ్గని 'వార్' ఎన్నికల తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు లేని ఎడల ఇదే విధానాన్ని కొనసాగిస్తానని ప్రకటిస్తోంది.

అందుకని రాష్ట్రంలోని దాదాపు మొత్తం జిల్లాలకు పాకిన నక్సల్స్ కార్యకలాపాలను హింసారూపం తీసుకోకుండా చూడడం బాధ్యతగల ప్రభుత్వం యొక్క విధి. తెలుగుదేశం అందుకు సిద్ధంగా లేకపోగా తద్వతిరేక దిశలో ముందున్న ఒకే ఒక ఎన్నికల ప్రత్యామ్నాయం కాంగ్రెస్, టి.ఆర్.ఎస్, వామపక్షాలు వంటి తెలుగుదేశం వ్యతిరేక రాజకీయ పార్టీలే. తన మానిఫెస్టోలో నక్సలైట్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించడానికి కృషి చేస్తానని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారానికి వస్తే మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో అందుకు పూనుకోవలసి ఉంటుంది. రాష్ట్ర ప్రజలకు చట్టబద్ధ పాలనను గ్యారంటీ చేయడం, కనీస ప్రజాస్వామిక పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా చూడడం రాబోయేప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలి. నక్సలైట్ల ఉద్యమంలో వ్యవహరించేప్పుడు కూడా ఈవిధానానికి భంగం కలగకుండా చూడడం ద్వారా సగం సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు ఉంటాయి. మిగతా సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి ఉభయపక్షాలు సిద్ధపడితేనే ఉద్యమ ప్రాంతాల ప్రజల ఆకాంక్షల్ని గౌరవించిన వారవుతారు. తద్వారా రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనడానికి, ప్రజాస్వామిక పద్ధతులతో సమస్యల్ని పరిష్కరించుకునేందుకు వీలు కలుగుతుంది.

– ఎ. అనంతరామ్,
హైదరాబాద్

'బడ్జెట్'కు సమతుల్యతా నమూనా కావాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల ఆధారంగా ఖర్చు చేస్తాయి. పాలక పార్టీ విధానాలు, ఆదాయం, ఖర్చు, రక్షణ అవసరాల్లాంటి వాటిని దృష్టిలో వుంచుకుని ఈ ఖర్చు జరుగుతుంది. పాలక పార్టీ తన విధానాన్ని సమర్థించుకోవడం, ప్రాధాన్యతా రంగాలను పక్కనపెట్టి అప్రధాన రంగాలకు ఖర్చు చేస్తుందని ప్రతిపక్షాలు విమర్శించటం మామూలే. ఇదిలాగే కొనసాగుతుంది. ఈ బడ్జెట్లు రూపొందించడానికి సముచితమైన, పొదుపుతో కూడిన ఒక నమూనా లేదు? అది వుంటే కేటాయింపులు, ఖర్చు, ఆ నమూనా ఆధారంగా బడ్జెట్లను తయారు చేయవచ్చు; సమతుల్యతతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. అలాంటి నమూనా లేకపోతే, ఆర్థిక శాస్త్రవేత్తలతో, పెట్టుబడుల వ్యవహారాల నిపుణులతో నమూనాను ఎందుకు రూపొందించకూడదు? ఇది వుంటే పాలకులు తమ చిత్తం వచ్చినట్లు కేటాయింపులు, ఖర్చులు చేయడాన్ని నివారించవచ్చు. అలాంటి నమూనాను రూపొందించినపుడు అనుకోని ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకోవాలి. ప్రభుత్వం అలాంటి నమూనాను రూపొందించ లేకపోతే, ఆర్థిక శాస్త్రవేత్తలే ఆ పనికి పూనుకోవచ్చు. సమతుల్య అభివృద్ధికి దోహదం చేయవచ్చు.

– వై.ఎస్. రావు,
హైదరాబాద్

వీక్షణంలో ప్రచురణ నిమిత్తం సమకాలిన రాజకీయార్థిక విషయాలపై విమర్శలను పంపించండి. వ్యాపార దృక్పథానికి దూరంగా ఉంటూ కేవలం పాఠకుల ఆదరణ, చందాదారులు, విరాళదాతల ప్రోత్సాహంతో వెలువడుతున్న ఈ ***వీక్షణం*** పక్షపత్రిక మీద మనందరిది. ఎప్పటికప్పుడు నాణ్యమైన రచనలతో సునిశితమైన విమర్శలతో ఉపయుక్తమైన సూచనల ద్వారా మరింతగా పత్రిక ఔన్నత్యానికి, ప్రగతికి తోడ్పడగలరని ఆశిస్తున్నాం – సం.

చంద్రబాబు పాలనలో జరిగిందేమిటి?

1991 భారతదేశ పాలక వర్గాలు అమలు పరుస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల సామ్రాజ్యవాద దేశాలకు మన దేశ ద్వారాలు పూర్తిగా తెరుచుకున్నాయి. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను వారికి ప్రయోగశాలగా తాకట్టు పెట్టాడు. ఆంధ్ర ప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చే దాకా నేను నిద్రపోను, మిగిలిన వాళ్ళని నిద్రపోనివ్వను అన్నాడొకసారి అతను. నిజమే. చివరికిది సామ్రాజ్యవాదులకు 'స్వర్ణ' ప్రదేశ్‌గానూ, పేద ప్రజలకు 'ఆంధ' ప్రదేశ్‌గానూ మిగిలింది. పట్టిందల్లా బంగారంగా మార్చే సామ్రాజ్యవాదులు ఇక్కడ స్పృశించని రంగం లేదు. పేదవాడికి తలదాచుకొను దిక్కులేదు. సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే, కొత్తగా మధ్యతరగతి కూడా కలిసి పేద వర్గం పెరిగిపోతోంది. పేదలు మరింత నిరుపేదలవుతున్నారు. ఈ సామ్రాజ్యవాద-దళారీ సంపర్కం విదిల్చే మెతుకులు ఏరుకునే వర్గం ఎన్నికల్లో ఆ పార్టీకి అధికారం కట్టబెడుతుంది. సహాయాలు, రుణాలు, గ్రాంటుల రూపంలో కోట్లకొద్ది రూపాయలు ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చి పడి, సామ్రాజ్యవాద బంటుల జేబులు నింపుతున్నాయి. అందుకు బదులుగా వారు రాష్ట్రంలోని సుసంపన్నమయిన మానవ, ప్రకృతి వనరులను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తున్నారు. భూముల్ని కారుచౌకగా ఇచ్చేస్తున్నారు. వాళ్ళ అవసరాన్ని బట్టి ఫ్యాక్టరీలను అమ్మేయడమో, మూసేయడమో చేస్తున్నారు. వ్యవసాయాన్ని వాళ్ళ దయాదాక్షిణ్యాలను విడిచిపెట్టారు. సేవారంగం ఇంచుమించు పూర్తిగా ప్రైవేటీకరించబడింది. సామ్రాజ్యవాద సంస్కృతి అనే మురుగునీరు వచ్చి ముంచేయడానికి వీలుగా గేట్లు ఎత్తిపెట్టారు. టూరిజం పేరుతో 'సెక్స్ పరిశ్రమ' అభివృద్ధి చెందుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాద తిమింగలాలకు ఆంధ్రప్రదేశ్ కలల పంటగా మారింది. దాని ఆదర్శ దళారీ సిఇఓ చంద్రబాబు.

సంస్కరణలు అమలు చేయడంలో ఏ మాత్రం వెనుకంజ వేయని చంద్రబాబుకు స్వతహాగా సిగ్గూ ఎగ్గూ, దయాదాక్షిణ్యం లేనేలేవు. ప్రజల కోరికలకు తలవంచడం కన్నా వారిని నరికి పోగులు పెట్టడమే మేలనుకుంటాడు చంద్రబాబు. ఈ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చేసిన అనేక వీరోచిత పోరాటాల్లో ఈ విషయం రుజువైంది. ఆంధ్రప్రదేశ్‌కున్న ప్రజాస్వామిక ఉద్యమాల సుసంపన్నమైన విప్లవ సంప్రదాయం వల్ల, ఇలాంటి నియంత సాయం లేనిదే సామ్రాజ్యవాదులు ఏమీ చేయలేరు. వాళ్ళ 'అడుగులకు మడుగులొత్తడం', వాళ్ళ విధానాలకు వ్యతిరేకంగా తలెత్తే ఉద్యమాలను ఉక్కుపాదంతో అణిచివేయగలిగే సేవకుడు వాళ్ళకి కావాలి. అందుకే 1999 ఎన్నికల్లోనూ, ఇప్పుడూ కూడా సామ్రాజ్యవాదులు అతడినే మళ్ళీ గెలిపించాలని అతని చేతికి కోట్లాది రూపాయలు అందిస్తున్నారు. పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ప్రపంచంలో అన్ని ప్రభుత్వాలూ ఫాసిస్టు స్వభావాన్ని సంతరించుకున్నట్టే ఇక్కడా జరుగుతోంది. గత ఎన్నికల తర్వాత టి.డి.పి., బి.జె.పి.ల మధ్య ముస్లిం ప్రజల రక్తం సాక్షిగా ఏర్పడిన అపవిత్ర మైత్రి ఈ అవసరంలోంచి పుట్టుకొచ్చిందే.

దేశంలో ఉద్యోగాలు పోగొట్టుకున్న పది లక్షల మందిలో 7.1 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ వారే. 1995-2002 మధ్య పెరుగుదల రేటు 0.3 శాతం మాత్రమే. వాస్తవానికి పెరుగుతున్న జనాభాతో పోలిస్తే ఇది ప్రతిష్టంభన కూడా కాదు. ప్రతికూల పరిస్థితి. గత దశాబ్దంలో 41,000 చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. మరో 386 ఫ్యాక్టరీలు మూతపడి మరో లక్షా తొంభై ఒక్క వేల మందిని నిరుద్యోగులను చేయడానికి సిద్ధంగా వున్నాయి. ఆర్థిక సర్వేలు ఆంధ్రప్రదేశ్‌లో 28 శాతం ఖాయిలాను సూచిస్తున్నాయి. బాల కార్మికులు అత్యధికంగా వున్నదీ ఆంధ్రప్రదేశ్‌లోనే. ప్రపంచ బ్యాంకు పెట్టిన షరతుల్లో భాగంగా ఏడాదికి 1.9 శాతం ప్రభుత్వోద్యోగాలు తగ్గిస్తానని చంద్రబాబు ఒప్పుకున్నాడు. ఇప్పటికే 16 ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. మరో 68, 2006 నాటికి ప్రైవేటు పరం అవుతాయి.

అబద్ధాల్లో ఆరితేరిన చంద్రబాబు, తన గురించి, తన కుహనా అభివృద్ధి పనుల గూర్చి బూటకపు ప్రచారం చేసుకోవడంలో ఇండియాలో ఏ రాజకీయ పార్టీ ఖర్చు పెట్టనంత సొమ్ము ఖర్చు పెట్టాడు. ఆంధ్రప్రదేశ్ గురించిన కొన్ని స్థూల గణాంక వివరాలు, వాస్తవాలు సత్యమేమిటో చూపుతాయి.

దేశంలో ఆత్మహత్యలు చేసుకున్న 4,500 మంది రైతుల్లో 3,000 మంది ఆంధ్రప్రదేశ్ వారే. వారిలో మహిళా రైతులు కూడా వున్నారు. చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అమలు చేసిన సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు ప్రత్యక్ష ఫలితం ఇది. ఎడతెగని కరువు పరిస్థితులు, సాగు సౌకర్యాలు లేమి, రుణాలు తిరిగి చెల్లించమని బ్యాంకుల నుంచి వత్తిడి, ప్రభుత్వం నుంచి ఏ సాయమూ అందకపోవడం, రైతులకు నష్టం కలిగించేలా మార్కెట్‌లో వారి ఉత్పత్తుల దరల అస్థిరత ఈ ఆత్మహత్యలకు దారి తీశాయి. రైతులే కాకుండా, అనేకమంది చేనేత కార్మికులు, కార్మికులు, ఉపాధి పోగొట్టుకున్న ఉద్యోగులు, సామ్రాజ్యవాద ఆర్థిక విధానాల అమలు వల్ల ప్రభావితులైన అన్ని సెక్షన్లకు చెందిన వారూ, ఉద్యోగం పోగొట్టుకున్న హిందీ పండిట్లు కూడా, ఇద్దరు మహిళలతో సహా

ఆత్మహత్య చేసుకున్నారు.

సాగుకు పనికొచ్చే భూమిలో 30 శాతం, అంటే 44 లక్షల హెక్టార్లు బీడుపడింది. ఈ దశాబ్దంలో వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి కేవలం 19 శాతానికి పడిపోయింది. 2002-03లో వ్యవసాయరంగంలో 7.23 శాతం ప్రతికూల పెరుగుదల నమోదయింది. ఇదే ఏడాది ఆహార ధాన్యాల ఉత్పత్తి 28.2 శాతం పడిపోయింది. 3,200 కోట్ల రూపాయల రుణం ఒక్క ఎకరం సాగు చేయడానికి కూడా ఉపయోగపడలేదు. అయినా పది లక్షల ఎకరాలు సాగయ్యాయని టిడిపి పచ్చి అబద్ధాలు చెబుతోంది.

ఉద్యోగావకాశాలలో పెరుగుదల 1.1 శాతానికి పడిపోయాయని ప్రణాళికా సంఘం నివేదిక చెబుతోంది. గత ఎన్నికల్లో చంద్రబాబు పదిలక్షల ఉద్యోగలిస్తామని చేసిన వాగ్దానం బూటకమని తేలిపోయింది. దేశంలో ఉద్యోగాలు పోగొట్టుకున్న పది లక్షల మందిలో 7.1 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ వారే. 1995-2002 మధ్య పెరుగుదల రేటు 0.3 శాతం మాత్రమే. వాస్తవానికి పెరుగుతున్న జనాభాతో పోలిస్తే ఇది ప్రతిష్టంభన కూడా కాదు. ప్రతికూల పరిస్థితి. గత దశాబ్దంలో 41,000 చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. మరో 386 ఫ్యాక్టరీలు మూతపడి మరో లక్షా తొంభై ఒక్క వేల మందిని నిరుద్యోగులను చేయడానికి సిద్ధంగా వున్నాయి. ఆర్థిక సర్వేలు ఆంధ్రప్రదేశ్‌లో 28 శాతం ఖాయిలాను సూచిస్తున్నాయి. బాల కార్మికులు అత్యధికంగా వున్నదీ ఆంధ్రప్రదేశ్‌లోనే. ప్రపంచ బ్యాంకు పెట్టిన షరతుల్లో భాగంగా ఏడాదికి 1.9 శాతం ప్రభుత్వోద్యోగాలు తగ్గిస్తానని చంద్రబాబు ఒప్పుకున్నాడు. ఇప్పటికే 16 ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. మరో 68, 2006 నాటికి ప్రైవేటు పరం అవుతాయి. రోజుకూలీ రేట్లు పడిపోవడంతో 2003లో అనంతపురం నుంచి లక్షలాది మంది కార్మికులు బెంగుళూరు, తదితర పట్టణాలకు వలసపోయారు. 1997-2001 మధ్య ఒక్క అనంతపురం జిల్లాలోనే 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రుణంగా తెచ్చిన రు.57,000 కోట్లతో, ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు. 1983-1994 మధ్య మహిళల ఉపాధి అవకాశాలు 2.7 శాతం ఉండగా అవి ఇప్పుడు 1.7 శాతానికి పడిపోయాయి.

జార్జ్‌మాన్ బయాట్ అనే బ్రిటిష్ పాత్రికేయుడు ఇలా రాశాడు - "ఆంధ్రప్రదేశ్ డిఎఫ్ఐడి నుండి 34.2 కోట్ల పౌండ్లు సాయంగా పొందింది. కరువు సాయంగా ఇథియోపియాకు ఇచ్చిన దానికంటే ఇది 15 రెట్లు ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌కే ఇంత ఎక్కువ-ఎందుకు? ఆంధ్రప్రదేశ్‌గా సిఇఓగా ఈ రాష్ట్రాన్ని బహుళ జాతి సంస్థలకు వెండి పళ్ళెంలో పెట్టి అప్పగిస్తున్నందుకు ఇతని ఘాతుకాల వల్ల రెండు కోట్ల మంది ప్రజలు వారి భూములు కోల్పోతారు. పేదరికం అనూహ్యంగా పెరిగిపోతుంది. పరోక్షంగా ఆహార భద్రత కరువవుతుంది. చివరికి ఈ పథకాలు ఆంధ్రప్రదేశ్‌ను ఒక పెద్ద ప్రయోగశాలగా మారుస్తాయి."

ఐ.టి.ని అభివృద్ధి చేసే పేరుతో వందలాది ఎకరాల విలువ భూమిని కారుచౌకగా ఇచ్చేశారు. అన్ని సబ్సిడీలు తొలగించి రైతుల ప్రాణాలు తీసిన ప్రభుత్వం ఐ.టి. కంపెనీలకు అనేక సబ్సిడీలు ఇచ్చింది. వారికిచ్చిన భూమిలో సగానికి పైగా ఉచితంగా ఇచ్చిందే. 50 కోట్ల రూపాయలకు మించిన ప్రతి ప్రాజెక్టుకూ సగం రేటుకే భూమినిచ్చారు. 500 ఎకరాలకు పైగా ఇలానే ఇచ్చివేశాడు. ఎపిఐఐసికి రంగారెడ్డి జిల్లా చుట్టుపక్కల 2,463 ఎకరాలు ఇచ్చేశారు. ఇంకో 282 ఎకరాలు ఇవ్వాల్సి వుంది. 2,563 ఎకరాలు ఉచితంగానో ల్యాండ్ ఫీ లేకుండానో ఇవ్వాల్సి వుంది.

సామ్రాజ్యవాదుల నిధులతో చేపట్టిన 'వెలుగు' సర్వే ప్రకారం దారిద్ర్యరేఖ దిగువన వున్న కుటుంబాలు 66,56,075, దారిద్ర్యరేఖపై ఉన్న కుటుంబాలు 61,21,583. జాతీయ గణాంకాల ప్రకారం ఈ రాష్ట్రంలో పేద ప్రజలు 15.8 శాతంగా వున్నారు. గ్రామీణ జనాభాలో 26.6 శాతం దారిద్ర్యరేఖకు దిగువ వుండగా, పట్టణ జనాభాలో 10.8 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువ వున్నారు.

అక్షరాస్యతా శాతం 61.11 వుంది. కోట్లాది రూపాయలు దీనిపై వెచ్చిస్తున్నట్లుగా ప్రభుత్వం (తప్పుడు) లెక్కలు చూపుతున్నా ఈ విషయంలో రాష్ట్రం దేశంలోనే 22 స్థానంలో వుంది. 2005 నాటికి 95 శాతం అక్షరాస్యత సాధిస్తామని చేస్తున్న వాగ్దానం ఎండమావే. 1980-81లో విద్య మీద ఖర్చు చేసిన 19.35 శాతం సొమ్మును 1998-99 నాటికి 12.98 శాతానికి తగ్గించిన రాష్ట్రం ఇదొక్కటే. ఫలితంగా 1980-81లో వున్న ఆరవ స్థానం నుంచి 21వ స్థానానికి పడిపోయింది.

ప్రభుత్వం బాగా ప్రచారం చేసుకున్న డ్వాక్రా పథకంలో మహిళలు తాము దాచుకున్న సొమ్ముపై కేవలం 3 శాతం వడ్డీ పొందుతూ, తీసుకున్న రుణాలపై 15 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. 1995లోనే మొదలైన కొన్ని గ్రూపులకు ఇంకా రివాల్వింగ్ ఫండే గ్రాంటు కాలేదు. 1991-2001 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో శిశులింగ నిష్పత్తి (0-5 సం॥) ఏకంగా పదకొండు పాయింట్లు పడిపోయింది. 2025 స్కాన్ సెంటర్లు నమోదయ్యాయి. తీవ్రమైన తాగునీటి సంక్షోభంతో సతమతమవుతున్న రాష్ట్రంలో (2003లో తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా అత్యధికంగా ప్రజలు మరణించిన విషయం మీకు గుర్తుండే వుంటుంది) కోక్ కంపెనీకి లీటరుకి 25 పైసల చొప్పున మంచినీరు సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లో, హైదరాబాద్‌లాంటి నగరాల్లోను రెండు మూడు రోజులకొకసారి, అదీ కొద్ది గంటలు మాత్రమే, మంచినీరు సరఫరా చేయడంతో ప్రజల మధ్య గొడవలు కూడా తలెత్తుతున్నాయి.

రాష్ట్రంలో అంతులేని కరువు పరిస్థితుల కారణంగా పేద మహిళల జీవితాలు అనేక రకాలుగా అతలాకుతలమయ్యాయి. వారిలో చాలా మంది ముంబాయి రెడ్‌లైట్ ఏరియాలకు గల్ఫ్‌దేశాలకు, ఇతర ప్రాంతాలకు అమ్ముడుపోయారు. రాయలసీమ ప్రాంతంలోనూ, ముస్లింలలోనూ ఇది మరీ ఎక్కువ. ఈ కారణంచేత

(మిగతా 10వ పేజీలో)

ఇజ్రాయిల్ టార్గెట్ హత్యలు

- తాతా శ్రీనివాసరావు

పశ్చిమాసియాలో అమెరికా కుటిలనీతి మూలంగా జాత్యాహంకార ఇజ్రాయిల్ అడ్డూ అదుపులేకుండా వ్యవహరిస్తోంది. స్వతంత్ర పాలస్తీనా కోసం పోరాడుతున్న పాలస్తీనా నాయకులను ఇజ్రాయిల్ టార్గెట్‌గా చేసుకుని హత్యలు చేస్తున్నది. పాలస్తీనా భూభాగంలో రక్తపుటేరులు పారిస్తున్నది. నిత్యం దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నది. పసిపిల్లలను సైతం టెర్రరిస్టులుగా ముద్రవేసి దారుణంగా హతమార్చుతున్నది. ఏకధృవ ప్రపంచంలో తనకు ఎదురులేదని ప్రపంచాధిపత్యం కోసం అన్ని నీతి నియమాలను, చట్టాలను అంతర్జాతీయ సూత్రాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అమెరికా ఈ హత్యలను గట్టిగా సమర్థిస్తున్నది. యుద్ధోన్మాది అమెరికా అండతో జాత్యాహంకారి ఎరియల్ షరోన్ మరింతగా పేట్రేగి పోతున్నాడు. చివరకు పాలస్తీనా విముక్తి ఉద్యమ నేత యాసర్ అరాఫత్‌ను కూడా హత్య చేస్తామని బరితెగించి ప్రకటించే సాహసం చేయగలిగాడు. గత సంవత్సరమే అరాఫత్‌ను హత్య చేయాలన్న ఇజ్రాయిల్ పథకానికి అమెరికా పూర్తి మద్దతు తెలిపింది. ప్రపంచ ప్రజల ఆగ్రహజ్వాలలకు భయపడిన అమెరికా ఈ పథకాన్ని అమలు కాకుండా ఇజ్రాయిల్‌ను తాత్కాలికంగా నిలువరించింది. ఈ పథకంలో భాగంగానే అరాఫత్ కార్యాలయంపై రెండుసార్లు క్షిపణి దాడులు చేసింది. ఆయనను గృహ నిర్బంధంలో ఉంచింది. ఏ క్షణంలోనైనా అరాఫత్‌ను చంపేందుకు ఇజ్రాయిల్ గత సంవత్సరం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. బలవంతంగా దేశం నుండి వెళ్ళగొట్టాలని ప్రయత్నించింది. ఇవన్నీ అమెరికా నేత జార్జిబుష్ కనుసన్నలతోనే జరిగాయి. అప్పటి నుండి నేతలను 'టార్గెట్' చేసుకుని ఇజ్రాయిల హత్యలు చేస్తోంది.

ఉగ్రవాదంపై పోరు ముసుగులో నిరాయుధలను, పసివారిని హత్య చేస్తూ పాలస్తీనా ప్రజల కనీస జీవించే హక్కునే కాలరాస్తున్నది. మానవత్వానికే మాయని మచ్చగా మారిన ఇజ్రాయిల్ దురాగతాలన్నింటికీ అమెరికాదే పూర్తి బాధ్యత. ఉగ్రవాదం పేరుతో ఆఫ్ఘనిస్తాన్‌పైనా, ఇరాక్‌పైనా దాడి చేసి, ప్రపంచం ముందు దోషిగా నిలిచిన అమెరికాకు షరోన్ చేస్తున్న ఘోరాలు కళ్ళకు కనిపించకపోవడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు కృషి చేస్తున్నానని చెప్పుకుంటూనే షరోన్ భూభాగ దురాక్రమణకు అమెరికా నిస్సిగ్గుగా మద్దతు పలుకుతోంది. వెస్ట్‌బ్యాంకు, గాజా ప్రాంతాల్లో కొత్తగా సెటిల్‌మెంట్లను నిర్మించడం, పునరావాస శిబిరాల్లో ఉన్న పాలస్తీనీయులను తిరిగి రావడానికి అనుమతించకపోవడం వంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నది. పాలస్తీనా భూభాగాన్ని శాశ్వతంగా దురాక్రమణ చేయడానికే గాజాలో ఇజ్రాయిల్ గోడను నిర్మిస్తున్నది. ఐక్యరాజ్యసమితి చేతకానితనం, అమెరికా అండతో ఇజ్రాయిల్ అన్ని అంతర్జాతీయ సూత్రాలను కాలరాస్తున్నది.

హమాస్ వ్యవస్థాపకుడు షేక్ అహ్మద్ యాసిన్‌ను ఇజ్రాయిల్ హత్య చేయడం కచ్చితంగా 'ఉగ్రవాద చర్య'నే. అంతకుముందు సెప్టెంబర్ 2003లో యాసిన్‌పై ఇజ్రాయిల్ దాడి చేసింది. యాసిన్‌ను హత్య చేయడాన్ని సమర్థించడం ద్వారా అమెరికా తన నైజాన్ని నిరూపించుకుంది. యాసిన్ హత్యపై ఐక్యరాజ్యసమితిలో ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకించడం ద్వారా ఈ తరహా హత్యలను నేరుగా సమర్థించింది. ప్రజలను సామూహికంగా హతమార్చాడని, మానవ హక్కులను హరించాడని, నేరం చేశాడని ఆరోపిస్తూ సద్దాంపై విచారణ చేపట్టిన అమెరికా నిజ స్వరూపం ఇది. ఇది నిత్యం ప్రపంచంలో ఏదో ఒక మూల మానవ రక్తం కళ్ళ చూస్తున్న అమెరికా, పాలస్తీనాలో హత్యలు చేయడమే పనిగా పెట్టుకున్న ఇజ్రాయిల్‌ను సమర్థిస్తున్న అమెరికా, మానవ హక్కుల గురించి మాట్లాడడం కంటే హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు. ఇలాంటి అమెరికా పాలస్తీనా ఏర్పాటు రోడ్ మ్యాప్‌ను తయారు చేశానని, దాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తామని, 2005 నాటికి పూర్తి స్థాయిలో స్వతంత్ర్య పాలస్తీనా ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని చెబితే నమ్మేవారు ఎవరు ?

> **నిత్యం ప్రపంచంలో ఏదో ఒక మూల మానవ రక్తం కళ్ళ చూస్తున్న అమెరికా, పాలస్తీనాలో హత్యలు చేయడమే పనిగా పెట్టుకున్న ఇజ్రాయిల్‌ను సమర్థిస్తున్న అమెరికా, మానవ హక్కుల గురించి మాట్లాడడం కంటే హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు. ఇలాంటి అమెరికా పాలస్తీనా ఏర్పాటు రోడ్ మ్యాప్‌ను తయారు చేశానని, దాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తామని, 2005 నాటికి పూర్తి స్థాయిలో స్వతంత్ర్య పాలస్తీనా ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని చెబితే నమ్మేవారు ఎవరు ?**

పాలస్తీనా విముక్తి ఉద్యమాన్ని 'ఉగ్రవాద'మంటూ అమెరికా, ఇజ్రాయిల్ బరితెగించి ముద్రవేస్తున్నాయి. ఏకధృవ ప్రపంచంలో తాను ఏం చెప్పినా, ఏం చేసినా చెల్లుబాటవుతుందని అమెరికా మిడిసిపడుతోంది. ఉగ్రవాదం పేరుతో పాలస్తీనా నాయకులను టార్గెట్ చేసుకుని హత్యలు చేయడం అమెరికా దృష్టిలో 'స్వీయరక్షణ'. మూడు చక్రాల కుర్చీ నుండి కదలలేని యాసిన్‌పై హెలికాప్టర్‌లోంచి తుపాకీ

గుళ్ళ వర్షం కురిపించి హతమార్చిన తీరు నిస్సందేహంగా మానవ హక్కుల ఉల్లంఘనే.

యాసిన్ హత్యకు ముందు అనేక మంది ముఖ్య నాయకులను, ఇజ్రాయిల్ హత్య చేసింది. యాసిన్ హత్యకు అమెరికా ఇచ్చిన మద్దతుతో పెట్రేగిపోయిన షరోన్ 25 రోజుల తేడాతో 17న మరో ముఖ్య హమాస్ నాయకుడు అబ్దుల్ అజీజ్ అల్-రాందీసిని క్షిపణి దాడిలో హతమార్చింది. ఆగస్టు 2003లో హమాస్ ముఖ్య నాయకుల్లో ఒకరైన ఇస్మాయిల్ అబు నవాబ్‌ను, 2002 జులైలో సాల్హే షేయిదాను టార్గెట్ చేసి హత్య చేసింది.

రముల్లాలోని అరాఫత్ భవనంపై దాడి చేసి ఆయన్ని హత్య చేయాలన్న దుర్మార్గమైన ఆలోచనను అన్ని ప్రపంచ దేశాలు గట్టిగా ఖండించాయి. ఇంత కండకావరం కూడదని హెచ్చరించాయి. అయినా అమెరికా మాత్రం షరోన్‌కు కళ్ళెం వేయడానికి సిద్ధం కావడం లేదు. అరాఫత్‌ను హత్య చేయమని ఇచ్చన హామికి కట్టుబడి ఉండాలని మాత్రమే అమెరికా 'కోరింది'. అణచివేతకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని ఉగ్రవాదంగా చిత్రించడమే దుస్సాహసం కాగా, పాలస్తీనా ప్రజల న్యాయమైన డిమాండ్‌ను తిరస్కరించి, వారిపై సైనిక దాడులు చేస్తున్న షరోన్‌ను అందుకు మద్దతు ఇస్తున్న బుష్‌ను అంతర్జాతీయ యుద్ధనేరగాళ్ళుగా ప్రకటించాలి. పాలస్తీనా హత్యలకు వీరిపై విచారణ జరిపించాలి. జినోయిస్ట్ షరోన్ వైఖరిని అమెరికా తొత్తుగా వ్యవహరించే బ్రిటన్ సైతం గట్టిగా వ్యతిరేకిస్తున్నది.

> **శాంతి చర్చలను బుష్ సహాయంతో విజయవంతంగా నీరుగార్చిన షరోన్ పాలస్తీనా ఉద్యమనేత యాసర్ అరాఫత్‌తో పాటు ముఖ్యమైన పాలస్తీనా నాయకులను 'టార్గెట్' చేసుకుని హత్యలు చేసే పథకాన్ని రూపొందించారు. ఈ పథకానికి అమెరికా ఆమోదం తెలిపింది. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ కొన్ని వందల సార్లు దాడులు చేసి మూడువేల మంది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకుంది. యాసిన్ హత్యతో ఇది పరాకాష్టకు చేరుకుంది.**

ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా 1987లో మొదటి ఇంతెఫాదా జరిగిన సమయంలో యాసిన్ హమాస్‌ను స్థాపించారు. ఏరియల్ షరోన్ ఇజ్రాయిల్ ప్రధానిగా ఎన్నికైన తరువాత 2000 సెప్టెంబర్ నుండి పాలస్తీనా దాడులు పెరిగాయి. శాంతి చర్చలను బుష్ సహాయంతో విజయవంతంగా నీరుగార్చిన షరోన్ పాలస్తీనా ఉద్యమనేత యాసర్ అరాఫత్‌తో పాటు ముఖ్యమైన పాలస్తీనా నాయకులను 'టార్గెట్' చేసుకుని హత్యలు చేసే పథకాన్ని రూపొందించారు. ఈ పథకానికి అమెరికా ఆమోదం తెలిపింది. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ కొన్ని వందల సార్లు దాడులు చేసి మూడువేల మంది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకుంది. యాసిన్ హత్యతో ఇది పరాకాష్టకు చేరుకుంది. అయినా దీనిని ఖండించడానికి అమెరికా నోరు పెగల్లేదు. అమెరికా వైఖరిపై ప్రపంచ వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. అమెరికాలో సైతం ప్రజలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి బుష్' వైఖరిని నిరసించారు. షరోన్, బుష్‌లే నేడు ప్రపంచంలో అందరికంటే పెద్ద ఉగ్రవాదులని వారు ముక్తకంఠంతో నినదించారు. ఐ.రా.స. మానవ హక్కుల సంఘం ఇటీవల వెలువరించిన నివేదికలో ఇజ్రాయిల్ దాడులను ఖండించింది. ఇజ్రాయిల్ ఈ ప్రాంతంలో భీతావహ పరిస్థితిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆ నివేదిక తెలిపింది. గాజా ప్రాంతంలో పెద్దగోడను నిర్మించడంతో పాటు, పాలస్తీనా ప్రజల ఇళ్ళను బుల్‌డోజర్లతో నేలమట్టం చేయడం, శరణార్థి శిబిరాలపై దాడులు చేసి పెద్ద సంఖ్యలో అసహాయులను హతమార్చడం జరుగుతున్నది.

ఇజ్రాయిల్ చేస్తున్న దురాగతాలకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలి. ఇందుకు ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలి. ప్రపంచ దేశాలు మెతక వైఖరి వల్ల అమెరికా, ఇజ్రాయిల్ మరింతగా రెచ్చిపోయి, బడుగు దేశాలకు మనుగడ లేకుండా చేసే ప్రమాదం పొంచి వుంది. జాత్యాహంకారం, సామ్రాజ్యవాదం పెనవేసుకుపోయి ప్రపంచంపై విరుచుక పడకముందు మేల్కోవడం ఎంతైనా అవసరం.

గోడ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయడంతో పాటు, ఇజ్రాయిల్ దాడులను, నాయకులను టార్గెట్ చేసుకుని హత్యలు చేసే హేయమైన చర్యలను తక్షణమే నిలిపివేసే విధంగా ఐక్యరాజ్యసమితి తగిన చర్యలు తీసుకోవాలి. ఇజ్రాయిల్ సైనిక దాడులు ఆగనంతకాలం ప్రతీకార దాడులు కూడా ఆగవు. యాసిన్ స్థానంలో హమాస్ నేతగా ఎన్నికైన అబ్దుల్ అజీజ్ అల్-రాంటసిని కూడా హత్య చేసి, ఇప్పుడు యాసర్ అరాఫత్ ప్రాణాలను సైతం తీయడానికి పథకం వేస్తున్న ఇజ్రాయిల్ దూకుడును అడ్డుకోకుంటే తీవ్ర పరిణామాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది.

మాతృభూమి కోసం పోరాడుతూ రక్తతర్పణ చేస్తున్న పాలస్తీనియన్ల కలను నెరవేర్చడమే ఈ సమస్యకు పరిష్కారం. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు మాత్రమే ఈ ప్రాంతంలో శాంతిని సృష్టించగలదు. అరాఫత్ ప్రాణాలకు ఎలాంటి హాని జరిగినా సహించేది లేదని ఐక్యరాజ్యసమితితో పాటు, జాత్యాహంకారాన్ని వ్యతిరేకించే ప్రతిదేశం ప్రకటించాల్సిన బాధ్యత ఉంది. అమెరికా దుర్నీతిని ఎండగట్టి, ఇజ్రాయిల్ మెడలు వంచి పాలస్తీనా ప్రజలు చిరకాల స్వప్నమైన 'మాతృభూమి'ని ఏర్పాటు చేయడమే ఈ సమస్యలకు పరిష్కారం. అప్పుడే ఈ ప్రాంతంలో శాంతి పవనాలు వీస్తాయి.

○

జీవిత బీమా సంస్థ కూల్చివేతకు కుట్ర

– వై.కృష్ణమూర్తి

లక్షణాంగా నడుస్తూ, లాభాలు సంపాదించి పెట్టే ప్రభుత్వరంగ సంస్థలను కూడా ప్రయివేటీకరించడం, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, కాషాయ ప్రభుత్వానికి తాజాగా పట్టుకున్న రోగం. సంస్కరణలు ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఈ "సంస్కరణలు" మింగుడు పడడం లేదు. ప్రత్యేకంగా ఓ మంత్రినే నియమించింది కూడా. ఈ బలహీనతను అవకాశంగా తీసుకొని విదేశీ సంస్థలు, ముఖ్యంగా బహుళజాతి సంస్థలు మన దేశం మీదకు దూసుకు వస్తున్నాయి. ఈక్రమంలో వారికున్న జాతీయ జీవిత బీమా సంస్థ (ఎల్.ఐ.సి.) మీద పడిందంటే ఆశ్చర్యం లేదు. ఎందుకంటే 02-03 సంవత్సరంలో ప్రీమియం చెల్లింపులు, సంస్థ ఇచ్చిన రుణాల మీద వచ్చిన ఆదాయం కలిపి 80 వేల కోట్ల రూపాయలు. ఇంత పెద్ద పెట్టున నిధులు సంతరించుకోవడంతో ప్రపంచం బ్యాంకు ద్వారా వాజ్‌పేయి మీద వత్తిడి తీసుకువస్తున్నాయి. ఆర్థికరంగంలో అమెరికా వైపు మొగ్గు చూపటంతో, వాజ్‌పేయి మీద వత్తిడి ఎక్కువైంది.

బ్యాంకింగ్, బీమా రంగం వ్యాపారంలో ప్రవేశానికి వీలు కల్పించాలని లేని పక్షంలో వారి వాణిజ్య నిబంధన 630 కింద ఆంక్షలు విధించాల్సి వస్తుందని అమెరికా బెదిరింపులు మొదలైనాయి. నెహ్రూ, దేశ్‌ముఖ్‌లు 50వ దశకంలో ఆనాటి విదేశీ, స్వదేశీ బీమారంగ సంస్థలు చేస్తున్న దగా, మోసాల ద్వారా ప్రజలు కోల్పోతున్న బీమా రక్షణ వారు పొదుపు చేసుకున్న మొత్తాల లూటి చూచి, బీమా సంస్థలను జాతీయం చేసి ప్రజల సొమ్ముకు రక్షణ కల్పించాలని, ప్రజల సొమ్ము ప్రజోపయోగానికే ఉపయోగించాలని మొదటగా జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేశారు. అయిదు కోట్లు పెట్టుబడి సమకూర్చి జీవిత బీమా సంస్థను ఏర్పరచారు. ఆనాడు మొక్కలా వున్న జీవిత బీమా సంస్థ నేడు మహావటవృక్షమై 16 కోట్ల పట్టాదారులతో 3 లక్షల 80 వేల కోట్ల విలువ కలిగిన ఆస్తులు సంపాదించుకుంది. పట్టాదారులకు తన విశ్వసనీయమైన సేవల ద్వారా కోట్లాది ప్రజానీకం యొక్క అభిమానాన్ని చూరగొన్నది. జీవిత బీమా సంస్థ విజయం వెనుక యాజమాన్యం, అధికారులు ఉద్యోగులు నిబద్ధతతో సాగించిన జాతీయం చేయబడిన నాటి లక్ష్యాల అమలు వున్నది.

అమెరికా వత్తిడి నానాటికి ఎక్కువ అవుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ రంగంలో ఆనాటికే నరసింహం కమిటి సిఫారస్సులు అమలు అవుతున్న నేపథ్యంలో ఆర్.ఎన్.మల్హోత్రా నాయకత్వంలో బీమా రంగంలో ప్రవేశ పెట్టాల్సిన సంస్కరణలు పేరున కమిటీ ఏర్పరిచింది. ఆ కమిటీ బీమా రంగంలో 'పోటీ' వాతావరణం ద్వారా మరింత "సమర్థవంతమైన సేవలు" అనే నినాదం మాటున స్వదేశీ విదేశీ సంస్థల ప్రవేశానికి సిఫారసు చేసింది. 1993లో ఆ నివేదిక ప్రభుత్వానికి అందినా 1998 వరకూ (బి.జె.పి. ప్రభుత్వ ఏర్పడే వరకూ) ఉద్యోగుల ఆందోళన వల్ల దేశ హితైషులు వ్యతిరేకత వల్ల అమలు కాలేదు. ఆనాడు బిజెపి కూడా స్వదేశీ ముసుగులో బీమా రంగంలో విదేశీ ప్రవేశాన్ని వ్యతిరేకించినా, తను ప్రభుత్వంలోకి రాగానే విదేశీ, స్వదేశీ సంస్థల ప్రవేశానికి తలుపులు బార్లా తెరిచింది. ఎన్.కె.సింగ్ కమిటీ చేసిన బీమా సంస్థలతో 49 శాతం విదేశీ పెట్టుబడిని అనుమతించాలని చేసిన సిఫారసు అమలు పరచడానికి వాజ్‌పేయి ప్రభుత్వం అంగీకరించింది. పార్లమెంటుకు ఇచ్చిన 26% విదేశీ పెట్టుబడి హామీని చట్ట నిబంధనను సవరించబోతోంది.

"రిస్ట్రక్చరింగ్ ఆఫ్ ఎల్.ఐ.సి." పేరున జీవిత బీమా వ్యాపారం మరింత లాభసాటిగా సాగటానికి తీసుకోవలసిన చర్యలు సూచించటానికి 'డిలాయిట్, టచ్ టామీవాట్సూ ఇండియా' అనే కన్సల్టెన్సీ సంస్థను నియమించింది. వారి నివేదిక అందకుండానే కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక సహాయ మంత్రి శ్రీ ఆనందరావ్ అట్సుల్ జీవిత బీమా సంస్థ ఆర్థిక పరిపుష్టత మీద బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. జూన్ 18, 2003న 'బిజినెస్ స్టాండర్డు' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జీవిత బీమా సంస్థ ప్రభుత్వ హామీ ఉపసంహరిస్తే కుప్పకూలిపోతుందని పెద్ద అభాండం వేశారు. నేటివరకు ప్రభుత్వంలోని ఏ ఒక్కరూ ఆ ప్రకటనను ఖండించలేదు సరిగదా కనీసం సవరించలేదు. వాస్తవం ఏమంటే ఈ వ్యవస్థను స్థాపించినపుడు ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి అయిదు కోట్లు మాత్రమే. జీవిత బీమా సంస్థను అసంబద్ధంగా యు.టి.ఐ.తో పోల్చి మరింత గందర గోళం సృష్టించారు.

అయినా 2003-2004 ఆర్థిక సంవత్సరంలో 2.75 కోట్ల మంది నూతన పట్టాదారులు జీవిత బీమా సంస్థలో చేరారు. రు.9000 కోట్ల ప్రీమియం మొదటి వాయిదాగా చెల్లించారు. పాలక వర్గాలు బురద చల్లినా ప్రజానీకంలో జీవిత బీమా సంస్థ ఎడల వున్న అపార ఆదరాభిమానాలకు, విశ్వాసానికి పై వివరాలు ప్రతీకలు.

పాలక పక్షం ఆశయానికి అనుగుణంగానే డిలోయిట్ కన్సల్టెన్సీ

> 'రెండోతరం సంస్కరణ' ముసుగులో జరగబోయే తతంగంలో మొదటి వేటు దేశీయ ఆర్థిక సంస్థల మీద పడుతుందని ఇటీవలి కాలంలో మంత్రులు ప్రకటనలు స్పష్టం చేశాయి. బ్యాంకులలో ప్రభుత్వ వాటాను $33\frac{1}{3}$% తగ్గించుకోవాలనే బిల్లు పార్లమెంటులో వుంది. పెట్టుబడులు ఉపసంహరణ మంత్రి శ్రీ అరుణ్‌శౌరి ప్రభుత్వరంగ సంస్థల నుండి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సంవత్సరానికి ఒక లక్ష కోట్లు ప్రభుత్వం సమకూర్చుకోవచ్చునని ప్రకటించారు. మూడున్నర లక్షల కోట్ల ఆస్తులు వున్న జీవిత బీమా సంస్థ వారి ఆలోచనలో ముందస్తుగా వున్నదనేది సుస్పష్టం.

జీవిత బీమా సంస్థను, 'కంపెనీలా' కిందకు తీసుకునివచ్చి, ప్రభుత్వ హామీ ఉపసంహరించి, అదనపు ఆర్థిక వనరులు సమకూర్చుకోవటానికి చట్టబజారులు వాటాలు అమ్ముకోమని సిఫారసు చేసినట్లు పత్రికలు ప్రభుత్వం జీవిత బీమా సంస్థ యాజమాన్యం రహస్యంగా వుంచిన విషయాన్ని బహిరంగపరిచాయి. దీనికితోడు ఈ రహస్య నివేదికలో కొన్ని అంశాల మీద ఎల్.ఐ.సి. బోర్డు తన అభిప్రాయాలను జోడించి ప్రభుత్వ మీద నిర్ణయానికి పంపినట్లు తెలిసింది.

జీవిత బీమా ఉద్యోగులు జీవిత బీమా సంస్థ నిలదొక్కుకోటానికి లాభాలు సంపాదించి పెట్టిన ప్రభుత్వరంగంలోనే కొనసాగడానికి అశేష కృషి చేశారు. సంస్థ అభివృద్ధితో పాటు వారి జీవిత భత్యాలు పెరిగాయి. వారి 'పేమాష్టర్సు' పట్టాదారులనే విషయం మరిచిపోకుండా సేవలు అందించారు. 2002-2003 ఆర్థిక సంవత్సరంలో 96.91 లక్షల పట్టాదారుల క్లైములు పరిష్కరించి ప్రపంచంలో వున్న అన్ని బీమా సంస్థలకు తలమానికమైంది. జాతీయ జీవిత బీమా సంస్థ. పట్టాదారులకు రు.17035.81 కోట్లు చెల్లించింది.

టెలికామ్ రంగంలో రిలయన్స్ వారికిచ్చిన రాయితీలతో చమురు రంగంలో వారు పట్టు సాధించిన తరువాత వారికున్న అపార నిధులతో జీవిత బీమా సంస్థ మీద కన్నుపడిందని, స్వదేశీ విదేశీ సంస్థలకు వత్తాసుగా వ్యవహరిస్తున్న ఆర్థిక మంత్రి, పెట్టుబడుల ఉపసంహరణ మంత్రి జీవిత బీమా సంస్థను కంపెనీగా మార్చి 'స్ట్రాటజిక్ పార్టనర్'గా రిలయన్స్‌ను చేర్చాలని ప్రయత్నాలు జరుగుతున్నాయనే విషయం కూడా బయటకు వచ్చింది.

'రెండోతరం సంస్కరణ' ముసుగులో జరగబోయే తతంగంలో మొదటి వేటు దేశీయ ఆర్థిక సంస్థల మీద పడుతుందని ఇటీవలి కాలంలో మంత్రులు ప్రకటనలు స్పష్టం చేశాయి. బ్యాంకులలో ప్రభుత్వ వాటాను $33^1/_3\%$ తగ్గించుకోవాలనే బిల్లు పార్లమెంటులో వుంది. పెట్టుబడులు ఉపసంహరణ మంత్రి శ్రీ అరుణ్‌శౌరి ప్రభుత్వరంగ సంస్థల నుండి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సంవత్సరానికి ఒక లక్ష కోట్లు ప్రభుత్వం సమకూర్చుకోవచ్చునని ప్రకటించారు. మూడున్నర లక్షల కోట్ల ఆస్తులు వున్న జీవిత బీమా సంస్థ వారి ఆలోచనలో ముందస్తుగా వున్నదనేది సుస్పష్టం.

ఒకనాడు ఎల్.ఐ.సి.ని విభజించి వాటి విభాగాల మధ్య పోటీ పెట్టాలనే ఆలోచనను, ఉద్యోగుల, ఆనాటి రాజకీయ పొందికల వత్తిళ్ళవల్లా విరమించుకొంది ప్రభుత్వం. ఈనాడు ప్రజాహిత శ్రేయస్సూ పట్టని ప్రభుత్వం, పెట్టుబడిదారుల కొమ్ము బహిరంగంగా కాసే ప్రభుత్వ మరల ప్రజలను "ఆలయ నిర్మాణం - అభివృద్ధి" నినాదం మాటున తిరిగి అందలమెక్కాలని ప్రయత్నించుతోంది. అభివృద్ధి కాముకులు, ప్రభుత్వరంగ శ్రేయోభిలాషులు ఈ తిరోగమన విధానాన్ని తిప్పికొట్టాలి. జీవిత బీమా ఉద్యోగులు సర్వం ఒడ్డి జీవిత బీమా సంస్థ ప్రైవేటీకరణను వ్యతిరేకించటానికి నిర్ణయించారు. పట్టాదారుల శ్రేయస్సు కోరేవారందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలి.

జీవిత బీమా సంస్థ పురోగతి		
	1957	2002-03
జీవిత బీమా విలువ (రూ.కోట్లు)	356.37	179811.17
అమలులో వున్న పట్టాలు (లక్షలు)	56.86	1411.63
పెట్టుబడులు (రూ.కోట్లు)	381.90	265044.00
పరిష్కరించబడిన క్లైములు (లక్షలు)	-	96.91
చెల్లించిన మొత్తం (రూ.కోట్లు)	25.00	17035.81

(7వ పేజీ తరువాయి)

చంద్రబాబు పాలనలో జరిగిందేమిటి?

లంబాడీ ఆదివాసీ మహిళలు, బాలికలు అమ్ముడుపోతున్నారని రిపోర్టులొస్తున్నాయి.

సామాజిక, ఆర్థిక సదుపాయాల కల్పనలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 15వ స్థానంలోనూ, దక్షిణ భారతంలో చివరి స్థానంలో ఉంది. ఎయిడ్స్ కేసులు, లైంగిక వ్యాధుల్లో మాత్రం ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలోవుంది. అలాగే మహిళలను బాలికలను అమ్మివేయడంలోనూ, ట్రాఫికింగ్‌లోనూ ఈ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. దేశమంతటా వున్న వేశ్యల్లో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే. అర్థరాత్రి బార్లు తెరిచీ, టూరిజాన్ని ప్రోత్సహించీ హైదరాబాదును దేశానికి సెక్స్ రాజధానిని చెయ్యాలని చంద్రబాబు సంకల్పం.

2001లో 406 వరకట్న హత్యలు, 3381 అత్యాచార ప్రయత్నాలు లైంగిక వేధిపుల కేసులు నమోదయ్యాయి. అనేకమంది మధ్యతరగతి ప్రజల జీవితకాలం పొదుపు చేసిన సొమ్ము దోచుకున్న ఫ్రాడ్ కేసులు 1995-2001 మధ్య 24.91కు పెరిగాయి. దేశంలో నమోదైన శిక్షార్హత ఉన్న క్రిమినల్ కేసుల్లో ఆంధ్రప్రదేశ్ భాగం 10.1 శాతం. ఇది బీహార్‌లో కన్నా రెట్టింపు!

తీవ్ర నిర్బంధం వున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజాస్వామిక ఉద్యమాల కారణంగా అనేకమంది మేధావులు, సంస్థలూ, ప్రజా సంఘాలు ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు రైతులు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగస్తులు, మహిళలతో సహా ఇతర సెక్షన్లపై ఎలాంటి దుష్పరిణామాలు చూపుతున్నాయో చక్కగా డాక్యుమెంట్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబుల బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేస్తూ అనేక పుస్తకాలు ప్రచురితమయ్యాయి. ఇక్కడిచ్చిన గణాంక వివరాలు ఆవగింజలో అరవంతైనా కావు.

ఈ నేపథ్యంలో ఏ రాష్ట్ర ప్రజలు ఏ పార్టీ ప్రభుత్వ విధానాల్లో అనుభవించినంత దుర్భర పరిస్థితుల్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం చంద్రబాబు తెలుగుదేశం ప్రభుత్వంలో అనుభవించారు. ప్రజలకు నరకాన్ని చూపించిన అలాంటి ప్రభుత్వ పాలన ఈ రాష్ట్రంలో కానీ మరో రాష్ట్రంలో కానీ మరోసారి తలెత్తకూడదని ఆశించాలి. రాబోయే ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పాలనకు తెరపడినట్లైతే నిజంగా ఈ ఎన్నికలు ప్రపంచబ్యాంకు విధానాల ఓటమిగానే భావించాలి.

('బాబు తొమ్మిదేళ్ళ పాలనలో మహిళలపై రాజ్యహింస' పుస్తకం నుండి)

అమెరికా సామ్రాజ్యవాద వ్యూహం - ఇండియా పాకిస్తాన్ సంప్రదింపులు

- ప్రొ. ఆర్‌విఆర్ చంద్రశేఖరరావు

అమెరికా తన ఆర్థిక, సైనిక పాటవ కారణంగా ప్రపంచంలో కెల్లా ఏకైక శక్తిగా అవతరించింది. కాని దాని ప్రపంచాధిపత్యం వక్రరీతులలోనే సాగుతోంది. సోవియట్ రష్యా కూటమి ఛిన్నాభిన్నమైనప్పటినుంచి, అమెరికా అగ్ర రాజ్యంగా వెలసినప్పటి నుంచి ఈ వైఖరి పొడసూపుతూనే ఉంది.

అయితే గత మూడు సంవత్సరాలుగా ఆ దేశం అహంకార ధోరణితో అంతర్జాతీయ నీతినియమాలను, సాంప్రదాయక కట్టుబాట్లను విసర్జించడం పరిపాటైంది. జూనియర్ బుష్ అధ్యక్ష పదవి క్రింద అమెరికా ఒక సరిక్రొత్త "ఉగ్రవాద ముఠా" చేతుల్లో పడింది. దీనిలో సూత్రధారులు ఉపాధ్యక్షులు డిక్‌చీని, రక్షణమంత్రి డోనాల్డ్ రమ్స్‌ఫెల్డ్, ఉపరక్షణమంత్రి పాల్ ఉల్ఫోవిట్జ్. వీరిని కరుడుగట్టిన సమకాలీన సామ్రాజ్యవాదులుగా భావించవచ్చు. బుష్ అధికారంలోకి రాక పూర్వమే అమెరికా ప్రపంచమంతటా తన గుత్తాధిపత్యం ఎలా ఏర్పాటు చెయ్యాలనే అంశాలపై వీరు ముసాయిదా తయారుచేశారు. ఈ ముసాయిదా బుష్ అధికారం చేపట్టిన నాటినుండి, అమెరికాకు ఖరారైన అధికార వ్యూహపత్రంగా రూపుదిద్దుకుంది. విదేశాంగ మంత్రి కొలిన్ పావెల్, ఈ ముఠాలో పూర్తి సభ్యుడు కాకపోయినా, తన మనుగడకోసమై ఈ కూటమితో సహకరించక తప్పడంలేదు. వీరు రూపొందించిన రాజకీయ, రక్షణ వ్యూహం యొక్క ముఖ్యాంశాలను క్రింది విధంగా చెప్పవచ్చు.

1. అమెరికా స్వీయరక్షణ ప్రయోజనాలకు సరిహద్దులంటూ లేవు. అమెరికా అంచనాల్లో ప్రపంచంలో ఏ మారుమూల అమెరికా వ్యతిరేక ధోరణులు పుట్టినా అది అమెరికా రక్షణ చుట్టుకొలత లోపలే వస్తోంది. అందుకని అమెరికా రక్షణ సంసిద్ధత ప్రపంచవ్యాప్తంగా ఉండవలసిందే.

2. ఈ దృక్పథంలో ఇదివరలో కుదుర్చుకున్న నిరాయుధీకరణ ఒప్పందాలు మొదలైనవి వెనక్కునెట్టి, అమెరికా తన వైజ్ఞానిక, సాంకేతిక శక్తి సామర్థ్యాలను వినియోగించి, శత్రుక్షిపణులను ఎదుర్కొనే పేరుతో రోదసి రక్షణ పేరుతోనూ, పునరాయుధీకరణ కొంత గుప్తంగాను, కొంత బహిరంగంగాను సాగిస్తోంది.

3. ఐక్యరాజ్యసమితిని నిర్వీర్యం చేయడమే కాక, దాని వివిధ భాగాలను కించపరచడం బుష్ ప్రభుత్వపు విధాన ధ్యేయం కూడా. ప్రపంచ శాంతిభద్రతలను నిర్వహించడం ముఖ్యంగా అమెరికాకే చెందిందనే భావం బుష్ సిద్ధాంతానికి పునాది రాయని చెప్పవచ్చును. సూక్ష్మంగా చెప్పాలంటే ఈ సిద్ధాంత ధోరణి రీత్యా ప్రపంచ శాంతిభద్రతలకు ఐక్యరాజ్యసమితి బదులుగా అమెరికాయే అవతరించిందన్నమాట.

ఈ ప్రాతిపదికలపైనే, ఐక్యరాజ్యసమితి స్థాపించినప్పటి నుండి, అంటే సుమారు 60 సంవత్సరాలుగా సూత్రప్రాయంగానైనా అనుసరించుతున్న అంతర్జాతీయ న్యాయ నియమాలను నేడు అమెరికా ఉల్లంఘించడం జరిగింది. ఉదాహరణకు: సమిష్టి భద్రతను ఏకపక్షంగా నిర్వచించటం, తన భద్రత (సైనిక, ఆర్థిక భద్రత) పరంగా అమెరికా ప్రపంచశాంతి భద్రతలను అన్వయించుకోవడం, రక్షణకు ముప్పు రావచ్చుననే కారణంగా ముందు జాగ్రత్త చర్యగానే యుద్ధాలకు దిగడం, అణ్వస్త్ర నిరోధన, రోదసీ రణనిరోధన ఒప్పందాలను ఏకపాక్షికంగా త్యజించడం, దేశ రక్షణ నెపంతో అంతరంగికంగా కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ, మానవహక్కుల పరిరక్షణ విలువలకు తిలోదకాలొదలడం. విశేషంగా ఈ అంశం, అమెరికా ప్రజాస్వామ్య ధోరణిలోని లోపాలను, బూటకాలను వ్యక్తం చేస్తుంది.

సెప్టెంబర్ 11, 2001లో అమెరికాలో జరిగిన అంతర్జాతీయ ఇస్లాం ప్రేరిత టెర్రరిస్టు దుర్ఘటన తరువాత, టెర్రరిజాన్ని ప్రతిఘటించే పేరుతో ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, ఇతర చోట్ల, అమెరికాలోనూ నిర్బంధంలోనికి తీసుకున్న అనుమానితులను క్యూబా ద్వీపంలోని అమెరికా ప్రాంతమైన గౌంటూనమొబేలో ప్రత్యేక జైళ్లను నిర్మించి, ఎటువంటి నేరవిచారణ పద్ధతులు లేకుండా ఖైదీలను నిర్బంధంలో వుంచడం గత రెండున్నరేళ్లుగా జరుగుతూనే ఉంది. హెబియస్ కార్పస్ ప్రమాణాలను పూర్తిగా వదిలివేయడం విశేషం.

ఇంతేకాక, దేశ పౌరులను అమెరికా విమానాశ్రయాలలో పట్టుకొని అంతకుముందు వారు నివసించే కొన్ని అరబ్ దేశాలకు అప్పగించడం జరిగింది. దీనిలోని రహస్యమేమిటంటే, ఈ అరబ్ దేశాలలో ఖైదీలను చిత్రహింసలు పెట్టి, నేరాలను ఒప్పించి, కావలసిన ఇతర కూపీలను లాగి టెర్రరిస్టుల సమాచారాలను తెలుసుకోవడం కోసం అమెరికా ఒడికట్టిన హేయమైన విధానం ఈ ప్రక్రియ వల్ల అమెరికా చేతులు మురికి కాకుండా, మానవ హక్కుల విషయంలో కనీస నియమాలైనా పాటించని అమెరికా 'మిత్ర' రాజ్యాలను ఈ నీచపు పనులప్పగించింది.

అమెరికా దిగజారిన నీతి ఆ దేశంలోనే నిశితమైన విమర్శలకు గురైంది. అటు అంతర్జాతీయ రంగంలోనూ, ఇటు అంతరంగికంగానూ, అమెరికా అహంకారం, అహంభావం దౌర్జన్యప్రాయంగా రూపొందింది.

ఇక అమెరికా తన శక్తిని బహిరంగంగా ప్రదర్శించిన ఇరాక్ ఉదాహరణను పరిశీలిద్దాం.

రెండు దేశాలలో కూడా రాజకీయ వ్యవస్థ మార్పిడికి అమెరికా నాయకత్వం క్రింద సంకీర్ణవర్గం పూనుకుంది. సాధారణంగా ప్రభుత్వ మార్పిడికి అంతర్జాతీయ న్యాయం ఒప్పుకోదు. ఐక్యరాజ్యసమితికే ఈ హక్కుందో లేదో అనుమానాస్పదం. ఆఫ్ఘనిస్తానులో తాలిబన్ ఇంచుమించుగా అంతర్జాతీయ సమాజం నుండి వెలివేయబడింది. ఐతే

అమెరికాకు సన్నిహిత దేశాలైన పాకిస్తాన్, సౌదీ అరేబియా లాంటివే తాలిబాన్‌కు మద్దతుదార్లుగా ఉంటూవచ్చాయి. 9/11 తరువాత మాత్రం అమెరికా ప్రేరణతోనే కాక, అల్‌ఖైదా దురాగతాల కారణంగా ఐక్యరాజ్యసమితి సభ్యులు అత్యంత మెజారిటీతో తాలిబాన్‌కు అల్‌ఖైదాతో తెగతెంపులు చేసుకోమని, ఆ వ్యవస్థను బహిష్కరించమని అల్టిమేటం కూడా ఇవ్వడమైంది. తాలిబాన్ దీనిని తిరస్కరించినా అమెరికా, ఇతరులు సైనిక దాడులు ప్రారంభించి తాలిబాన్ వ్యవస్థని అంతమొందించారు. కనుక ఆఫ్ఘనిస్తాన్‌లో తన ప్రభుత్వ చర్య న్యాయసమ్మతమేనని సమర్థించుకోవడానికి ఒక అవకాశమేర్పడింది..

ఇరాక్ ఉదంతం

ఇరాక్ ఉదంతం వేరు. ఐక్యరాజ్యసమితి ఇరాక్‌ను అణ్వస్త్ర, రసాయనిక తదితర మారణహోమ అస్త్రాలను వదులుకోమనడం ఇరాక్ అసలటువంటి అస్త్రాలు తన దగ్గర లేనేలేవనడం ఒక దశాబ్దంపైగా జరుగుతూనే ఉంది. ఎన్నో పరిశీలక బృందాలు తనిఖీలు చేసి నికరంగా ఏమీ తేల్చలేకపోయాయి. ఐతే ఇరాక్ మాత్రం తనిఖీ బృందాలకు పూర్తి సహకారం ఇవ్వకపోవడం, ఇదివరలో ఇరాక్ తన పౌరులైన కుర్ద్ ప్రజలమీదే రసాయనికాస్త్రాలను ప్రయోగించడం వల్ల, అనుమానాలు ఉంటూనే వచ్చాయి. ఈ అనిశ్చిత పరిస్థితిని అమెరికా ఆసరాగా చేసుకొని ఐక్యరాజ్యసమితిపై ఒత్తిడి తీసుకొచ్చింది. అపోహలతో కూడిన అర్థసత్యాలను, సమితి ముందు దృఢసత్యాలుగా వర్ణించింది. బ్రిటిష ప్రధాని పార్లమెంటులో ఇదే విధంగా అంతగా ఆధారంలేని అర్ధసత్యాలను వల్లించి ఇరాక్ తృటికాలంలో మారణాస్త్రాలను ప్రయోగించే సామర్థ్యం సంపాదించిందని చెప్పారు. ఐక్యరాజ్యసమితి మాత్రం ఇరాక్‌కు ఇంకొంత వ్యవధి ఇవ్వాలని అంతవరకు ఇరాక్‌పై శిక్షాపరమైన సైనిక చర్యలు సమంజసం కావని నిర్ణయించింది. అమెరికా, బ్రిటన్‌లు ఐక్యరాజ్యసమితి నిర్ణయాన్ని త్రోసిపుచ్చి ఇరాక్‌పై దాడులు ప్రారంభించి, ప్రభుత్వం మార్పుకే పూనుకున్నారు. ఇదివరలో చెప్పినట్లు, సద్దాం హయాం నికృష్టమైన స్థాయికి చేరుకోవడం కారణంగా అమెరికా, బ్రిటన్‌ల సైనిక చొరవ వెనుకనున్న అధర్మ విధానానికి కొంత సమర్థన తెచ్చిపెట్టింది. కాని అసలు సత్యాన్ని దాచిపెట్టడం కష్టం. అమెరికా విధానం వెనుక ఆదినుంచి సద్దాంను గద్దెదింపాలని, అతని వర్గాన్ని కూకటివేళ్లతో అంతం చేద్దామనే ఉద్దేశమే. ఫ్రాన్సు, జర్మనీ, రష్యా, ఇతర అగ్రరాజ్యాలు ఈ విధానాన్ని తీవ్రంగా నిరసించాయి.

అమెరికా ఇరాన్‌పై మొదటినుంచి కన్నువేసే వుంచిందని, అంతర్జాతీయ టెర్రరిజంపై ప్రపంచవ్యాప్త యుద్ధం ప్రకటించక ముందునుండీ ఇరాక్‌ను హస్తగతం చేసుకోవాలనే ధ్యేయం అమెరికా వ్యూహంలో ముఖ్యమైన అంశమని అనేక విశ్లేషకుల అభిప్రాయం. తదుపరి కాలంలో బయటపడిన పత్రాలు, రహస్యరక్షణ విధానాల ముసాయిదాల ఆధారంగా ఈ అభిప్రాయం దృఢపడింది. 9/11 దుర్ఘటన పుట్టుపూర్వోత్తరాలు, ఆ విషయంలో అమెరికా ప్రభుత్వం తీసుకొన్న జాగ్రత్తలను దర్యాప్తు చేయడానికి వేసిన కమిటీకి అందిన సాక్ష్యాధారాలు బట్టి, అల్‌ఖైదా నుంచి వచ్చే ముప్పును ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని బలమైన ఆధారాలు దొరికాయి. ఇరాక్‌ను ఆక్రమించడం, సద్దాం హయాంను నిర్మూలించడమే అమెరికా లక్ష్యమని అంతర్జాతీయ టెర్రరిజాన్ని నెపం మాత్రంగా పరిగణించారనే విమర్శకు మరింత మద్దతు వచ్చింది. మొదటి నుంచి బుష్ రెండవసారి అధ్యక్ష పదవిని చేజిక్కించుకొనేందుకు ఇరాక్‌పై రక్షణ వ్యూహాన్ని సన్నద్ధం చేసారనే నగ్నసత్యం బయటపడినట్లయింది. ఈ వ్యూహం వెనుక రిపబ్లికన్ పార్టీలోని ఉగ్రవాదుల ప్రేరణ, స్ఫూర్తి వుండనే ఉన్నాయి. ప్రపంచంలో తన అసమాన శక్తి సామర్థ్యాలను పటిష్టం చేసుకొని దాని ద్వారా సైనిక ఆర్థిక లబ్ధిని పూర్తిగా పొందడమే ఈ నవసామ్రాజ్యవాదుల ఆశయం. దాని అమలే ఇరాక్ ఉదంతమని తెలియచేస్తోంది.

కాని అమెరికా సాధించిందేమిటి? సద్దాంను గద్దె దింపారు. పట్టుకున్నారు కూడా. అయితే అల్‌ఖైదా ఇంకా దోబూచులాడుతూనే ఉంది. బిన్ లాడెన్ ఇంకా పట్టుబడలేదు. ఇరాక్‌లో ప్రజాస్వామ్య రాజ్యస్థాపనకు నాంది కూడా జరగలేదు. సరికదా, పరిస్థితి అస్తవ్యస్తమై అమెరికా ఎలా పలాయనమంత్రం పఠించాలని సతమతమౌతోంది. హయాం మార్పు విషమ సమస్యలు తెచ్చిపెట్టింది.

ఇరాక్ ప్రజానీకం ఇప్పటికి అమెరికా సంకీర్ణ సైన్యాలను దురాక్రమణదారులుగా భావిస్తున్నారు. ఆ సైన్యాలపై రోజురోజుకు దాడులు ఉధృతమవుతూనే ఉన్నాయి. యుద్ధకాలంలో (ఏప్రిల్, మే 2003) మరణించిన అమెరికా సైనికుల సంఖ్యకన్నా తదుపరి జరిగిన అమెరికన్ ప్రాణనష్టం ఎక్కువ సంఖ్యలో ఉంది. ఇక అమెరికా నెలకొల్పిన తాత్కాలిక ప్రభుత్వ విషయం ఇంకా దుర్గతిలో ఉంది. తన ప్రతినిధి పాల్ బ్రెన్నర్ క్రింద నెలకొల్పిన తాత్కాలిక సమీకరణ వ్యవస్థ దాని అజమాయిషీ క్రింద ఉన్న ఇరాక్ పరిపాలనా సమితి ప్రాతినిధ్యరహితంగా భావించబడుతున్నాయి. సద్దాంకాలంలో వ్యతిరేక వర్గాలతో కూడిన అతుకులబొంతలాగ రూపొందాయి. ఇరాక్ ఉత్తరంలో ఉన్న 'కుర్దు' వర్గాలు, దక్షిణంలో ఉన్న షియా వర్గాలు, మధ్యనున్న సున్నీ వర్గాల మధ్య సయోధ్య లేదు. సరికదా, పరస్పర ద్వేషాలు, వైషమ్యాలతో సమాజం అట్టుడికిపోతోంది. ప్రభుత్వం ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని మనుగడ సాగిస్తోంది.

మొదట్లో షియాలు అమెరికా ఆక్రమణను సహించినా రానురాను అవి అమెరికాకు పక్కలోబల్లెంలా తయారయ్యాయి. వారి మద్దతుకోరి అమెరికా మొదట్లో షియావర్గాలను సాయుధం చేసింది కూడా. ఆ పరిణామం విషమించింది. అవి గత అయిదు నెలలుగా అమెరికా, ఇతర అక్రమణ సైన్యాలపై విప్లవ స్థాయిలో దాడులు జరుపుతున్నాయి. గతవారంలోనే షియానాయకుడు ముక్తదా అల్ సదర్ ఆధ్వర్యాన దక్షిణా ప్రాంతలో నజఫ్ నగరంలో భీకరపోరాటం జరిగింది. ఇక సున్నీవర్గాల నుండి బాంబులు, క్షిపణుల దాడుల సంగతి చెప్పనక్కర్లేదు. బాగ్దాద్ నగరం, దాని దగ్గరలో ఉన్న పట్టణాలలో, అమెరికా, దాని తొత్తుగా గుర్తించబడిన ఇరాక్‌పాలక ప్రభుత్వంపై హింసాకాండ ఎడతెరిపి లేకుండా

కొనసాగుతూనే ఉంది.

ఇరాక్‌ను స్వపరిపాలనా వ్యవస్థకు అప్పగించి, జూన్ ఆఖరుకు తాను నిష్క్రమిస్తానని అమెరికా ఇది వరలోనే నిర్ణయించింది. పరిస్థితులు విషమించినా తన నిష్క్రమణ తప్పదనడం పలాయనమంత్రాన్ని పఠించడమే. ఏదోలాగ నవంబరు ఎన్నికల(అమెరికా)లోగా ఇరాక్ ఊబినుండి బయటపడడం బుష్‌కి అత్యవసరం. ఇరాక్‌లో ఎటువంటి రాజకీయ వ్యవస్థను నెలకొల్పుతారన్న సమస్య ఇంకా పూర్తి పరిష్కారం కాలేదు. ఏదో విధంగా ఆఫ్ఘనిస్తాన్‌లో మూడు ఏండ్లక్రితం తయారుచేసినట్లుగా ఇరాక్‌లో వివిధ ప్రాంతాలనుండి, వివిధ వర్గాలలో మిళితమైన శాసనసభను సృష్టించి దానినుండి ఒక ప్రభుత్వాన్ని నెలకొల్పడమన్నది అమెరికా ఉద్దేశ్యం. అయితే అధిక సంఖ్యాకులైన షియాలు ఎన్నికలు జరపాలన్నారు. ఇరాక్‌ను విచ్ఛిన్నం చేయడం అమెరికా ఉద్దేశ్యమని షియాల గట్టి అనుమానం. ఈ పరిస్థితుల్లో అమెరికా ఐక్యరాజ్యసమితి సహాయం కోరక తప్పలేదు. సమితి ఉన్నత కార్యదర్శి, కోఫీ అన్నన్ పరిశీలక బృందాన్ని పంపి ఇప్పట్లో ఇరాక్‌లో ఎన్నికలు అసంభవమని తేల్చారు. ఎలాగైనా ఏదో ఒక రాజకీయ పరిష్కారాన్ని కనుగొనమని అమెరికా, బ్రిటన్‌లు ఐక్యరాజ్యసమితిని అర్థించారు. అమెరికా ఎంత బాధ్యతారహితంగా ప్రవర్తించినా ఐక్యరాజ్యసమితి తన శాంతిభద్రతల విధులను విస్మరించలేదు. కనుక సమితి ప్రతినిధి, ఈ విషయాలలో ఆరితేరిన లఖ్‌దార్ బ్రాహ్మి ఇరాక్ తాత్కాలికమైన కొంతవరకైనా ప్రాతినిధ్యపరమైన వ్యవస్థను స్థాపించడానికి, అక్కడి వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ ప్రక్రియ రెండు నెలల్లోపున ఎంతవరకు సాధ్యమో వేచిచూడాలి. ఇరాక్ రాజ్యాంగచట్టమొకటి కూడా తయారైంది. ఇది కూడా తొందరగా కానిచ్చిన పనే.

ఐక్యరాజ్యసమితిని ఇరాక్‌లోని రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని సరిదిద్దమని, ఈ బహుకష్టతరమైన పనిని అప్పగించడంలో అమెరికా, ఇతర అనుచర దేశాల బుద్ధి తక్కువతనాన్ని తెలుపుతున్నాయి. సమితికి ఎటువంటి అధికారాలివ్వబడతాయి అన్న ప్రశ్నకు ఖచ్చితమైన జవాబు లేదు. అయితే గత కొద్దినెలలుగా ఐక్యరాజ్యసమితికి ఇరాక్‌లో రాజకీయ వ్యవస్థ నెలకొల్పడంలో స్వేచ్ఛనివ్వక తప్పలేదు. ఈ వర్గాలను చేరదీసి, నిజాయితీతో వ్యవహరిస్తూ, ఆ నిజాయితీని ఇరాకీ ప్రజలు విశ్వసించునట్లు చేయడం సమితికే సాధ్యమని అమెరికా గుర్తించినట్లుంది.

కానీ రాజకీయంగా ఇరాక్ నుండి తప్పుకున్నా, అమెరికా సైనిక ఆర్థిక రంగాలలో ఇరాక్‌లో చాలాకాలం వరకు తిష్టవేసినట్లే. ఇరాక్ సైనిక రక్షణ బాధ్యతను తాను వదిలే ప్రసక్తి లేదని ఇదివరలోనే ప్రకటించింది. ఆర్థికంగా ఇరాక్‌ను తన వశం చేసికోవడం అమెరికా లక్ష్యాలలో అతి ముఖ్యమైనది. చమురు నిధులను హస్తగతం చేసుకోవడం, ఇరాక్ భావి ఆర్థికవికాస సాధనలో కలుగనున్న లాభాలు, అమెరికా పెట్టుబడిదారి వర్గాలకు, దానికి చెందిన అమెరికా వాణిజ్య కార్పొరేషన్ల ప్రయోజనాలకు సంక్రమించు అవకాశాలు ఎన్నో ఉన్నాయి. అందువల్ల ఇరాక్‌లో ఒక విధమైన ద్వంద్వ నియంత్రణ వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. సాధారణ రాజకీయ, సామాజిక, ఆరోగ్యం, మొదలగు విషయాలు తాత్కాలిక ప్రభుత్వానికప్పగించినా, ఇరాక్‌ని కీలక విషయాలలో అమెరికా తన చేతినుండి జారుకోవడం జరగనివని. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి కూడా అమెరికాను సవాలు చేయలేదు.

భారత్ - పాకిస్తాన్

ఈ నేపథ్యంలో భారత్, పాకిస్తాన్‌లలో అమెరికా సంబంధాలు కొత్త పంథాలో నడవసాగాయి. 9/11న టెర్రరిజాన్ని తన స్వంత వాకిట్లోనే ప్రత్యక్షంగా చవిచూచిన అమెరికా, పాకిస్తాన్‌కు సన్నిహితమవుతుందని మొదట్లో ఇండియా భావించింది. దశాబ్దాలుగా కాశ్మీరులోనూ, తన ఇతర ప్రదేశాల్లోనూ తరచూ ఇస్లాంమత ప్రేరితమైన కొన్ని తీవ్రవాదశక్తుల అరాచకాలకు గురైన ఇండియా, ఈ విషయంలో పాకిస్తాన్ పాత్రను మరింతగా అర్థం చేసుకుని ఇండియాకు మద్దతు ఇవ్వగలదని భావించింది. హుటాహుటి అంతర్జాతీయ టెర్రరిజంపై అమెరికా ప్రకటించిన యుద్ధానికి తన పూర్తి మద్దతును ప్రకటించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వం అంతమొందడం ఇండియాకు లాభదాయకమే. తాలిబాన్ పతనంతో కాశ్మీరులో ఉగ్రవాద చర్యలు తగ్గుముఖం పడతాయని, పాకిస్తాన్, సైనిక శక్తులకు అమెరికా చర్య ఆటకట్టవుతుందని ఇండియా అంచనా.

అయితే, తాలిబాన్‌ను వెంటాడడంలోనూ, దాని నీడలో వ్యవహరిస్తున్న ఆల్‌ఖైదాను, దాని స్థావరాలను నిర్మూలించడంలోనూ పాకిస్తాన్ అమెరికాకు అత్యంతావసరమైన మద్దతుదారుగా మారింది. పాకిస్తాన్ అధ్యక్షులు పర్వేజ్ ముషారఫ్ చాకచక్యంతో, పాకిస్తాన్ సైన్యం పెంచి పోషించిన తాలిబాన్‌ను అమెరికాకు బలిపశువు చేయడానికి వెనుదీయలేదు; వెనుదీయక తప్పలేదు. ఈ విషయంలో ఆయన అతి సాహసంతో వ్యవహరించారని చెప్పక తప్పదు. ఆయన మనుగడకే ముప్పు తెచ్చుకున్నా, ఈ సవాలును ఎదుర్కోగలిగారు. అందువల్లనే అమెరికా ముషారఫ్ పట్ల కృతజ్ఞత వ్యక్తపరుస్తోంది. ఇదివరకు ఆయుధ సరఫరాపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయడం, భారీ ఎత్తున ఆర్థిక సహాయాన్ని అందివ్వడం ఇందుకు తార్కాణాలు. ఇంతకన్నా విశేషం పాకిస్తాన్ అణ్వస్త్ర నిపుణుడు, ఖాదిర్‌ఖాన్ వివిధ దేశాలతో జరిపిన అణ్వస్త్ర రహస్యాల చోరీ మొదలగు నేరాలను, ముషారఫ్ క్షమించడాన్ని అమెరికా దిగమింగుకొని ఊరుకుంది. ఈ ఉదంతంలో పాకిస్తాన్ సైనిక వర్గాలకు కూడా పాత్ర ఉండడం కారణం ఇంకా రచ్చకెక్కుతే ముషారఫ్ మనుగడకే గండం వస్తుందనే అమెరికా ఈ సంక్షోభాన్ని కప్పిపుచ్చింది.

అమెరికా-పాకిస్తాన్‌లు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఇంకో అంతరార్థం ఉంది. ముషారఫ్, ఆల్‌ఖైదాను, ముఖ్యంగా ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకోవడంలో ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరిస్తారు అన్న ప్రశ్న వేసుకోక తప్పదు. ఎంతైనా అంతర్జాతీయ టెర్రరిజానికి పాకిస్తాన్‌లో ఉనికి ఉండక మానదు. బిన్ లాడెన్‌ను వేటాడడంలో ముషారఫ్ ఉదాసీనత అర్థరహితం కాదు. పోగా, కాశ్మీరులో టెర్రరిజాన్ని ఆయన పూర్తిగా అరికట్టలేదు. అరికట్టబోరు. కాశ్మీరులో ఉగ్రవాదాన్ని, అంతర్జాతీయ

అంతర్జాతీయం

టెర్రరిజంతో పోల్చరాదని ఆయన పదే పదే అన్నారు. ఒకదేశపు స్వతంత్ర పోరాట వీరుడు మరొక దేశపు టెర్రరిస్టు అనే సూక్తిని కూడా పలికారు. టెర్రరిజం ఎట్టి పరిస్థితులలోనైనా సహించరానిదని ఎంత అన్నా, రాజకీయ వాస్తవాలను గుర్తించక తప్పదు. ముషారఫ్ కాశ్మీరు ఉగ్రవాద శక్తులను పాకిస్తాన్‌లో పూర్తిగా కట్టుబాటు చేయడం కష్టతరమైన పని.

అయినప్పటికీ ఆయన ప్రయత్నాలు కొంతగానైనా సాఫల్యమవుతున్నాయని ఇండియా కూడా భావించడం గమనార్హం. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంప్రదింపులు సత్ఫలితాల్నిస్తాయని ఆశించాలి. ఇరుపక్షాలు వారివారి ఇదివరకటి వాదనలు, సమర్థింపులను సడలించడం జరుగుతుంది. ముఖ్యంగా కాశ్మీరు సమస్య పరిష్కారంలో పాకిస్తాన్‌కి పాత్ర ఉందని ఇండి ఒప్పుకోవడం ముదావహం. 1948 నాటి బూజుపట్టిన ఐక్యరాజ్యసమితి చేసిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రతిపాదనను వదులుకుంటానని ముషారఫ్ అనడం మరింత ఆశాజనకం. ఈ సంప్రదింపుల వెనుక అమెరికా దౌత్యపరమైన ఒత్తిడి ఉండనే ఉంది. ఉపఖండంలో శాంతి చేకూరితే అమెరికా ప్రయోజనాలకు లాభదాయకమే. అయితే ముషారఫ్ ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకొని అమెరికా కాశ్మీరు సమస్య పరిష్కారానికి ఇండియాను మరింత సడలింపులు చేయమని సలహా ఇవ్వడం తప్పదు. వాజ్‌పేయి తన రాజకీయ మద్దతుదార్లను. (భా.జా.పా. రాష్ట్ర స్వయం సేవక్ సంఘం, విశ్వహిందూపరిషత్‌లను) ఈ విషయంలో ఒప్పించగలిగాలి. ఎన్నికల తరువాత ఎన్.డి.ఏ. తిరిగి అధికారంలోకి వస్తే పాకిస్తాన్‌తో సంబంధాల విషయంలో వాజ్‌పేయికి తగ్గ చొరవ, అధికారం చేకూరుతుందా? దానికి సమతుల్యంగా భా.జా.పా., ఇతర హిందూ మతవాదులకు దేశంలో ఆంతరంగిక విషయాలలో ఎక్కువ చొరవ, ప్రమేయం సంక్రమిస్తుందా? వీటికి జవాబుల కొరకు వేచిచూడాలి.

ఇండియా–పాకిస్తాన్ సంప్రదింపులు ఒక్కమారుగా పరిష్కారాలను తీసుకొని రావడం సంభవం కాదు. ఒడిదుడుకులొచ్చినా, ప్రస్తుత వాతావరణం కొనసాగునట్లు రెండు దేశాలు జాగ్రత్త పడాలి. ఏ కారణం చేతనైనా సంభాషణలు వైఫల్యం చెందితే, రాబోయే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఒకపక్క నిస్పృహ, మరొకవైపు పరస్పర నిందారోపణల మధ్య మరల శత్రుత్వ భావం విరుచుకుపడుతుంది. రెండు దేశాలు అణ్వస్త్రధారులు కాబట్టి మరో యుద్ధం ఇదివరకటి చెలియలి కట్టదాటి ఊహించని వక్రగతులలో సాగవచ్చు. అందువల్ల ఇండియా - పాకిస్తాన్ సంప్రదింపులు సక్రమమార్గంలో నడుస్తాయని ఆశించాలి. ❍

వినదగు నెవ్వరు చెప్పిన...

మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటక సి.ఎం. ఎస్.ఎమ్.కృష్ణ, ఒరిస్సా సి.ఎం. నవీన్ పట్నాయక్‌లు తిరిగి అధికారం నిలుపుకోవచ్చు. కానీ మూడోసారి ముఖ్యమంత్రి పదవికి ఆశపడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరుద్ధంగా ప్రజలు తీర్పు చెప్పవచ్చు.

– ఎన్.డి.టి.వి.

28శాతం మంది ఫీల్‌గుడ్‌కు అనుకూలంగా మొగ్గగా మిగిలిన 72శాతం మంది ఫీల్‌గుడ్ ప్రచారం పట్ల విముఖత వెలిబుచ్చారు.

– 'జీ' న్యూస్ సర్వే

గోద్రా అల్లర్ల సందర్భంగా మరణించిన అనేకమంది అమాయక ప్రజల శవాల గుట్టలపై మోడీ పాలన సాగిస్తున్నారు.

– శంకర్‌సింగ్ వాఘేలా

ప్రధాని వాజ్‌పేయి నియోజకవర్గం లక్నోలో చీరల పంపిణీ కార్యక్రమం ఎన్నికల నియమావళి ఉల్లంఘించటమే అవుతుంది.

.....పలు పార్టీలు తాగునీరు, రహదారి, ఉపాధి, విద్య, ఆరోగ్య పరిరక్షణ తదితర వాస్తవ సమస్యలను పరిష్కరించాల్సి ఉండగా... తన తల్లి, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధి విదేశీ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్నాయి.

– ప్రియాంకగాంధి

భాజపాకు ఒక ఎజెండా లేదు. ప్రపంచంలో అజెండా లేకుండా నడిచే ఏకైక పార్టీ భాజపానే. 1989 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ప్రతీసారి రామమందిరం అజెండాగా ప్రజల్లోకి వస్తున్నారు.

– గులాం నబీ ఆజాద్

నక్సలైట్ల విధానాలు మంచివేనని కాని హింస చేయడం మంచిది కాదని గణనీయంగా 52.41 మంది అభిప్రాయపడగా, ఆశ్చర్యకరంగా నక్సలైట్లే లేకుంటే రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారుల ఆగడాలకు అంతు వుండేది కాదని 30.5 శాతం ప్రజలకు ప్రకటించారు. సానుభూతి విషయంలో నక్సలైట్లకు పోలీసులకు పోల్చినపుడు 24.6 శాతం మంది నక్సలైట్లపై సానుభూతిని వ్యక్తం చేయగా కేవలం 14.9 శాతం మంది మాత్రమే పోలీసులపై సానుభూతిని ప్రకటించారు. నక్సలైట్లను దారిదోపిడి దారులకన్నా హీనమని 7.3 శాతం ప్రజలు అభిప్రాయపడితే వాళ్ళకి టెర్రరిస్టులకు తేడా లేదనే అభిప్రాయాన్ని కేవలం 9.5 శాతం మంది వెలిబుచ్చారు.

– సర్వే, ఎ.పి.కాలేజ్ ఆఫ్ జర్నలిజం

ఆర్థిక వృద్ధి స్థాయిలో ఉద్యోగితా రేటు పెరగలేదన్నది వాస్తవం.

– ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అశోక్ లహిరి (రాయిటర్స్ వార్తా సంస్థతో)

దళిత - మైనారిటీ సంబంధాలు, ఒక దృక్పథం

– చిట్టిబాబు

దళిత, ముస్లిం స్పృహల మధ్య ఒక మౌలికమైన తేడా వుంది. వాటిని దళిత మార్క్సిస్టు దృక్పథం నుంచి పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశం. దళిత స్పృహ కోరేది ఆత్మగౌరవం. మైనారిటీ స్పృహ ఆశించేది ఆత్మరక్షణ. వీరిద్దరి మధ్యా సమన్వయం సాధించాలనుకునే ప్రయత్నాలకి ఈ తెలివిడి అవసరం. దళిత స్పృహ చాలా మట్టుకు స్వచ్ఛందం. మైనారిటీ స్పృహ చాలా వరకూ బయటివారు రుద్దినది. ఉపన్యాసాలనూ విద్యావంతుల రాతలనీ చూస్తే ఈ రెండు బృందాల వారికీ ఒకరే శత్రువనే భ్రమ కలుగుతుంది. ఆ భ్రమ రాతల్లోనేగానీ చేతల్లో లేదు. కాబట్టి బహుజన సమాజ్ పార్టీ వారు ఏ సంకోచం లేకుండా బిజెపితో జట్టుకట్టారు. ఆ పార్టీ భావజాలాన్ని ఎత్తుగడలని ఆంధ్రప్రదేశ్‌లోనూ దళిత మేధావులు ఆదర్శంగా తీసుకుంటున్నారు.

దళిత స్పృహకీ ఇతర ఉద్యమాలన్నిటికీ ఒక ముఖ్యమైన తేడా ఉంది. ఏ ఉద్యమమైనా చైతన్యమైనా పైకి ఎదిగివచ్చే ఏ సమిష్టి ప్రయత్నమైనా చరిత్రని ఒక ప్రత్యేక పద్ధతిలో వ్యాఖ్యానించుకుంటుంది. చరిత్ర పొడుగునా సాధికారత కోసం, వనరుల వాటా కోసం, గౌరవం కోసం జరిగిన ప్రయత్నాలన్నిటా ఒక సాధారణ అంశం కనిపిస్తుంది. గతంలో తమ బృందానికి ఒక స్వర్ణయుగం ఉండేదనీ కనీసం పరిస్థితి మెరుగ్గా ఉండేదనీ ఏవో కారణాల వల్ల ఇప్పుడు పరిస్థితులు దిగజారాయనీ గత వైభవాన్ని పునరుద్ధరించడమే ప్రస్తుత కర్తవ్యమనీ ఆ బృందాలు (కనీసం వారి నాయకత్వం) తమ చరిత్రకి భాష్యం చెప్పుకుంటాయి. పైకి వచ్చే ప్రయత్నాలకి ఒక ఊపునీ, ఉద్రేకాన్నీ తెగింపునీ కల్పించడానికి ఈ వ్యాఖ్యానం తోడ్పడుతుంది. తరచూ వారి ప్రయత్నాలకి అడ్డంకులను పట్టుదలగా తొలగించుకోవడానికి అవసరమైన త్యాగాలు చేయడానికి చారిత్రక అన్యాయం అనే భావన ఎంతో అవసరం అవుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో ఆ చారిత్రక వ్యాఖ్యానం ఎంత వరకూ 'నిజం' అనేది అనవసరమైన విషయం. దళిత స్పృహ వరకూ వస్తే పరిస్థితి సరిగ్గా తలక్రిందులు. దళితుల మనసుల్లో చాలా బలంగా నాటుకుపోయిన ఒక చారిత్రక చట్రం ఉంది. దాని ప్రకారం "గతంలో తమ పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. కనీస మానవ హక్కులు సరే, మానవ హోదా కూడా ఉండేది కాదు. 'ఇప్పుడు పరిస్థితి కాస్త మెరుగుపడింది, ఇంకా మారాల్సినది, ఎంతో ఉంది'. ఈ అభిప్రాయం చాలా వరకూ తప్పు. అదలా ఉండనిస్తే, దళిత స్పృహలో పదును లేకపోవడానికి ఈ రకం చరిత్ర వ్యాఖ్యానం కారణం. గొప్పగా బతుకుతూ ఉండిన తమని ఎవరో ఒకరు ఓడించో మోసం చేసో దిగజార్చారనే ప్రచారం లేకుండా ఏ ఎత్నిక్ ఉద్యమమూ సమరశీలమైన పోరాటం చేపట్టలేదు. మౌలిక మార్పులని ఆశించగలదు గానీ డిమాండ్ చేయలేదు. అందుకే దళితుల రాజకీయ బలం వారి జనాభా నిష్పత్తిలో పోలిస్తే చాలా బలహీనంగా ఉంటుంది. దళితుల మీద దళిత నాయకత్వం పట్టు చాలా తక్కువగా ఉంటుంది. అందుకే దళిత స్పృహలో కసి ఉండదు. ఇదొక్కటే కారణం కాదు గానీ, ఈ చారిత్రక దృక్పథం దళిత రాజకీయాల తీరుతెన్నులని నిర్ణయించే ఒక ముఖ్యమైన అంశం. ఈ చారిత్రక చట్రం దళిత జనుల మనసుల్లో బలంగా నాటుకుపోవడానికి తొలికాలం నాటి చరిత్ర రచనలూ, ప్రాచీన కాలం నుండీ దళితులకు జరుగుతూ వచ్చిన అన్యాయాల గురించి దళిత నాయకత్వం చేసిన ప్రచారమూ కొంతవరకే కారణాలు. చెవుల్లో సీసం పోయడం గురించి ఇప్పటికీ వీధుల్లో దళిత నాయకుల ఉపన్యాసాల్లో ప్రతిసారీ వస్తుంటుంది. ఆ ధర్మాలు ఎంతవరకు అమలయ్యాయి? వాటిపట్ల దళితులు ఎలా స్పందించారు అనే ప్రశ్నలుగానీ, అసలు చాతుర్వర్ణ ధర్మం అని శాస్త్రాలలో పదేపదే వినిపించే మాటలకీ అప్పటి వాస్తవాలకీ పొంతన ఎంత ఉండేదీ అనే ప్రశ్నలు అసలు ఎవరూ అడగరు. ఈ విషయం మీద జరిగిన చారిత్రక పరిశోధనలు ఎందుకోగానీ దళిత మేధావుల్లో సైతం చర్చకు రావు. ఇదంతా చెప్పడమెందుకంటే, దళిత స్పృహకి ఆధారమైన చరిత్ర వ్యాఖ్యానం కసినీ పోరాటశీలతనీ కలిగించలేదని తేల్చి చెప్పడానికే. అందుకే దళిత ఉద్యమం ఇప్పుడు ఒక సర్దుకుపోయే ఉద్యమం. దళితులు చాలా కాలంగా వెలివేయబడిన సమాజం కాబట్టి వారి డిమాండ్‌లలో "మమ్మల్ని కలుపుకోండి" అనే కోరికా, సంసిద్ధతా చాలా బలంగా ఉంటాయి. కలుపుకునేందుకు ముందుకు వచ్చే వారి దురుద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నా పట్టించుకోకుండా వాటేసుకొనే ధోరణి దళితులలో హెచ్చు. ఈ ధోరణినీ, ముస్లిం స్పృహని ఎలా అంచనా వేయాలన్న ప్రశ్ననీ కలిపి పరిశీలించాలి.

హిందూ-ముస్లిం ఐక్యత అనే భావనకి పెద్ద చరిత్ర లేదు. 'హిందూ' అనే కులబేధాలని విస్మరించే భావన స్థిరపడింది ఈ మధ్యనే. ఆ తర్వాతే వాటి మధ్య ఐక్యత అనే అంశం రాజకీయ ఎజెండాలోకి వచ్చింది. అప్పటికి బ్రిటిష్ ఇండియా అనే పాలనా యూనిట్ ఏర్పడింది గానీ భారతదేశం, జాతి అనే భావన ఇంకా పుట్టనైనా లేదు. ఉన్నత ప్రభుత్వోద్యోగాలలోనూ, కొన్ని వనరుల పోరులోనూ కులీన వర్గాల మధ్య పోటీ హిందూ, ముస్లిం లేబిళ్లను పుట్టించింది. అలాంటి వర్గీకరణకి ఆయా వర్గాలతోపాటు వలసవాదుల మతిలేని వర్గీకరణ

దృక్పథం కొంత కారణం. అప్పుడే హిందూ ముస్లిం ఐక్యత అనే భావన కూడా పుట్టింది. వనరుల మీదా అవకాశాల మీదా జరిగిన ఈ పోటీ కులీన వర్గాల సమస్య. ఐక్యతా ప్రయత్నాలు కూడా వారి మధ్యే జరిగాయి. అదే సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతూనే వస్తోంది. ఇప్పటికీ హిందూ ముస్లిం ఐక్యత పేరిట జరిగే ప్రయత్నాలన్నీ అగ్రవర్ణ-ముస్లిం ఐక్యతగానే జరుగుతాయి. ఆధిపత్య కులాల సాంస్కృతిక ప్రతీకలని ముస్లిం మత ప్రతీకలతో కలిపి చూపడమే హిందూ ముస్లిం ఐక్యతా ప్రయత్నాల ఫేవరెట్ మార్గమై కూచుంది. దీనికంటే దళితులూ ముస్లింలూ గొడ్డుమాంసాన్ని కలిసి తినే వేడుకలు జరపడం ఇంకా మెరుగైన శక్తిమంతమైన పద్ధతి. దీన్ని ఎంచుకున్న సందర్భాలు చాలా అరుదు.

గతంలో నాజీజమూ రకరకాల ఫాసిస్టు ఉద్యమాలూ పుట్టుకు వచ్చినప్పుడు వాటిని ఏదో ఒక వర్గానికో కొన్ని వర్గాలకో ముడిపెట్టి వివరించాలనే (వామపక్ష, ఉదారవాదుల) ప్రయత్నాలు జరిగాయి. అలాంటి తప్పుదోవ పట్టించే సూత్రీకరణలు చేసి ఆ ఉద్యమాలకి అధికారాన్ని కట్టబెట్టి దారుణ మానవ విధ్వంసాలకి వాటిని పాల్పడనిచ్చాయి. ఇక్కడ కూడా సంఘ్ పరివార్ రాజకీయాలని ఏవో కొన్ని కులాలకి ముడిపెట్టి అర్థం చేసుకోవాలనే మూర్ఖ ప్రయత్నాలు చాలా కాలంగా జరుగుతున్నాయి. అందువల్ల సంఘ్‌పరివార్‌ని ఆధిపత్య కులాల ప్రతిఘాత విప్లవంగా చాలా మంది చూస్తున్నారు. ముస్లింలనీ క్రైస్తవులనీ తప్పించి జైన బౌద్ధ సిక్కు మతాలతో సహా ఒక విశాల హిందూ జాతిని నిర్మించే ప్రయత్నంగా చూడటంలేదు. అందుకే దళిత-ముస్లిం, క్రైస్తవ ఐక్యత మీద చాలా మందికి అతి అంచనాలు ఉన్నాయి. దళిత నాయకుల బ్రాహ్మణ హిందూ వ్యతిరేక భాష చాలా తప్పుదోవ పట్టిస్తున్నది. సంఘ్‌పరివార్‌కి విశాల హిందూ ఐక్యత కావాలి. కులం అడ్డు తొలగాలి. కుల నిర్మూలన కమ్యూనిస్టుల కంటే, అంబేద్కరిస్టుల కంటే, సంఘ్‌పరివార్‌కే ఇప్పుడు ఎక్కువ అవసరం. ఆ హిందూ ఐడెంటిటీని ఒక్కటే అన్నట్లు చూపించి ముస్లిం, క్రైస్తవ సమాజాలని ఆ నిర్వచనం నుంచి తప్పించడం వారి ఆశయం, లక్ష్యం. ఆధిపత్య కులాలు చాలా కాలంగా పన్నుతున్న ఎత్తుగడలనే అనుసరించి అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయనీ ఆ విషయాన్ని ఆత్మవంచన లేకుండా బాహాటంగా ఒప్పుకుంటున్నాయనీ దళిత రాజకీయ నేతలు అంటుంటారు. కానీ సంఘ్‌పరివార్ శక్తులు కల్పిస్తున్న (లేదా కల్పించక తప్పని) అవకాశాన్ని అందిపుచ్చుకోవడం తప్ప అది మరేం కాదు. ఈ చేదు నిజాలని అర్థం చేసుకోవడానికి సిద్ధపడకపోతే, దళిత-ముస్లిం ఐక్యత కోసం ఆచరణయోగ్యమైన ప్రణాళికను రూపొందించుకోలేం. అలాంటి ఐక్యత లేకుండా అపాయంలో పడ్డ భారతీయ ముస్లింల, (దళితేతర) క్రైస్తవుల ప్రాణాలను కాపాడటం వీలుకాదు. ఈ మధ్య ప్యాపిలిలో దళితుల మీద బి.సి.లు జరిపిన దాడిని తప్పుడు భావజాలంగానో అరుదైన దుర్ఘటనగానో వ్యాఖ్యానించబోయిన బిసి మేధావుల్ని దళిత మేధావులు సరిగ్గానే నిలదీశారు. దళిత బహుజన ఐక్యత అనే భావనలోని కప్పదాట్లని ఎత్తిచూపారు. మరి అదే దళిత మేధావులు సంఘ్‌పరివార్ వారి దాడులలో హత్యాకాండలో ఆదివాసులూ ఇతర దళితులూ పాలుపంచుకోవడం గురించి అడిగితే ఏమి చెబుతారో చూడాలి. పార్లమెంటులో పూర్తి మెజారిటీ రాకపోవడం వలనా, ప్రతిపక్షాన్ని ధ్వంసం చేసేంత బలం ఇంకా సమకూరనందునా, ఎన్నికలు జరపకుండా పాలన సాగించే పరిస్థితులు ఇంకా ఏర్పరిచే స్థితి లేనందువల్లా ఆధిపత్య కులాల అండ పోతుందనీ సంఘ్‌పరివార్ జంకుతున్నదిగానీ ముందుముందు దాని దళిత అనుకూల ధోరణి పెరిగి తీరుతుంది. అంటే ఆధిపత్య కులాలవారికి దళిత అనుకూలత వచ్చిపడుతుందని కాదు. సంఘ్‌పరివార్‌కి ఆధిపత్య కులాలతోనూ అప్పుడు చిక్కులు రాకతప్పదు. దానితోపాటే ముస్లింల మీద అత్యాచారాలూ వాళ్ళని దేశం నించి వెళ్ళగొట్టే ప్రయత్నాలూ ముదిరిపోతాయి. అంటే దళితులకి పూర్తిస్థాయి హిందువులుగా మారే అవకాశమూ ముస్లింలకి క్రైస్తవుల్లో కొంత మందికీ (దళిత క్రైస్తవుల పట్ల పరివార్ వైఖరి వేరేగా ఉంటుంది) దేశం విడిచిపోవాల్సిన అగత్యమూ కలుగుతాయి. అప్పుడు దళిత ప్రజానీకమూ వారి నాయకత్వమూ ఏమి ఎంచుకుంటారో ఊహించడానికి పెద్దగా తెలివితేటలు అక్కరలేదు. ఇప్పటి వారి రాజకీయ ప్రవర్తన చూస్తే చాలు, సులువుగానే గ్రహించవచ్చు. ఇలాంటి దుర్మార్గ విధానాలు సాధ్యమా అని ఎవరైనా విస్తుపోవచ్చు. అవును, సాధ్యమే. ఇరవయ్యో శతాబ్ది చరిత్రలో ఇలాంటివి జరగవనే ధీమా ప్రజలకి ఉన్నచోటనే అవి జరిగాయి. అలాంటి ఊహాతీత మానవ విషాదాలు జరగాలంటే అలాంటివి సాధ్యం కావనే ధీమా ప్రజలలో, ముఖ్యంగా బాధితుల్లో ఉండటం అవసరం. ఇప్పుడు దళిత నాయకత్వం ఎంచుకోవాల్సిందేమంటే ముస్లింలనీ క్రైస్తవులలో ఒక భాగాన్నీ సంఘ్‌పరివార్ దయాదాక్షిణ్యాలకి వదిలేసి, సంఘ్‌పరివార్ ఆశయాలు అందిస్తున్న అవకాశాలని అందిపుచ్చుకోవడమా లేదా అన్నదే. కాన్షీరాం, మహారాష్ట్రలోని కొంత మంది దళితులూ తమ మార్గమేమిటో ఇప్పటికే స్పష్టం చేశారు. ఎటోచ్చీ ఆంధ్రదేశంలోని దళిత మేధావులే తమ వైఖరిని చెప్పకుండా దాటవేస్తున్నారు. శివసాగర్, కత్తి పద్మారావు,

సతీష్‌చందర్, బొజ్జా తారకం, కలేకూరి ప్రసాద్, ఘంటా చక్రపాణి, కృపాకర్ మాదిగ, కె.ఎస్.చలం, పాల్ దివాకర్, కేశవకుమార్, పైడి తైరేష్‌బాబు, మల్లేపల్లి లక్ష్మయ్య, వేముల ఎల్లయ్య, మద్దూరి నగేష్‌బాబు, జెల్లయ్య నాయక్, గోగు శ్యామల, కృష్ణమాదిగ, గోరటి వెంకన్న, జె.గౌతమ్‌లాంటి వారు ఏమంటారో చూడాలి. బహుశా కళ్యాణరావూ, కెవీ సుబ్బారావూ, కె. సత్యనారాయణ, గద్దర్, మార్క్సిస్టులు కాబట్టి సంఘ్‌పరివార్‌తో దళిత పార్టీల పొత్తుని ప్రమాదకరమని అవకాశవాదమనీ అనవచ్చు. వారి సంగతి కూడా చూద్దాం.

దళితుల మీద దాడులు జరిగినప్పుడు విప్లవ పార్టీలు కలగజేసుకుని దోషులని చంపిన సందర్భాలు ఉన్నాయి. ముస్లింల మీద జరిగినప్పుడు మాత్రం ఈ విప్లవ పార్టీలు ఎందుకు పట్టించుకోవో అర్థం కాదు. దళితులు హిందువులు కాబట్టేనా అని అడిగితే అసభ్యమనిపిస్తుంది గానీ అది న్యాయమైన ప్రశ్నే. ఎక్కడ, ఎప్పుడు దాడులు జరిగినా బాధితులకి ఆయుధాలివ్వాలని డిమాండ్ చేసే రాడికల్ మేధావులూ, కార్యకర్తలూ ముస్లింల మీదా క్రైస్తవుల మీదా దాడులు జరిగినప్పుడు శాంతి పావురాలెందుకయిపోతారో అంతుపట్టదు. రిజర్వేషన్లు సరిగ్గా కొన్ని చోట్ల అమలు కావడం లేదని ఎత్తి చూసేవారెవ్వరికీ ముస్లింలకి అసలు రిజర్వేషన్లే లేవనే విషయం ఎందుకోగాని పట్టదు. ఎన్‌కౌంటర్ల అక్రమాన్ని బయటపెట్టే పౌరహక్కుల సంఘాలకి ఐ.ఎస్.ఐ. ఏజెంట్లనీ తీవ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని చెప్పి ఎంత మంది ముస్లిం యువకులని ఎత్తుకుపోయి మాయం చేసినా, చిత్రహింసలు పెడుతున్నా, చంపిపడేస్తున్నా చీమైనా కుట్టదు. ఇటీవలి కాలం వరకూ అగ్రవర్ణ మార్క్సిజమని పిలుస్తూ వచ్చిన దానిని హిందూ మార్క్సిజమని గుర్తించాలని కొందరు ఇచ్చిన పిలుపుని ఎవరూ పట్టించుకున్న దాఖలాగానీ కనీనం ఖండించినట్లుగానీ ఎక్కడా కనిపించలేదు. బొట్టులో కనిపించని మతం, జాకెట్టులో కనిపించని అణచివేత మన కవులకి బురఖాలో మాత్రమే కనిపించడం పక్షపాతమని ఎవరూ అనరు. సంఘ్‌పరివార్‌ని అత్యంత నిలకడగా ప్రతిఘటించే మార్క్సిస్టులలోనే ఇంత పక్షపాతం ఉందంటే ఏమీ అనుమానం రాకుండా బతికెయ్యాలనుకోవడం ముస్లింలు ప్రదర్శిస్తున్న ఉష్ట్రపక్షి ధోరణి తప్ప మరేమీ కాదు. మతసామరస్యం కోసం గణేష్ ఉత్సవాల్లో పాల్గొనే ముస్లింలు మరి హిందూ శాంతివాదులెవ్వరూ నమాజు చేయడానికి ఎందుకురారని ఆలోచిస్తే బావుంటుంది. ఒక ముస్లిం రచయితని తీవ్రంగా విమర్శించిన (కథ రాసినందుకు) సాహస జర్నలిస్టు రమణమూర్తి మరి ఆరెస్సెస్ సాహిత్యకారుల మీదా ముదిగొండ శివప్రసాద్ లాంటి వాళ్ళ మీదా ఎందుకలాంటి దాడి చెయ్యలేకపోయారు? కుల, జండర్, వర్గ, ప్రాంతీయ దోపిడీల మీద వచ్చిన కొల్లలకొద్దీ కేరికేచర్ కథల మీద ఆయనకి రాని కోపం, హిందూ ముస్లిం సంబంధాల మీద ముస్లిం రచయిత రాసినప్పుడే ఎందుకు రావలసి వచ్చింది? స్త్రీలు మాత్రమే, దళితులు మాత్రమే రాసిన సాహిత్యం అంటూ ప్రత్యేక సంకలనాలని అభినందించి చప్పట్లు చరిచిన ప్రగతిశీల సాహిత్యలోకం గుజరాత్ గురించి ముస్లిం రచనలతో ప్రత్యేక సంకలనం తెస్తే ఎందుకు పట్టించుకోలేదు? నాణ్యతకీ, నవ్యతకీ పేరెన్నికగన్న ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రచురణ సంస్థ ఆ పుస్తక ప్రచురణను మధ్యలో ఎందుకు ఆపేసింది? హింసకి ఎవరు పాల్పడినా తప్పేనంటే ఒప్పుకోని పౌరహక్కులవారూ కులానిదేముంది పేదలందరి కష్టాలూ ఒక్కటేనంటూ విరుచుకుపడే దళితవాదులూ దండిగానే హాజరైన గుజరాత్ గాయం సభలో కొందరు సాహిత్యకారుల మీద వెకిలిరాతల కరపత్రం రావడాన్నీ, గుజరాత్ ముస్లిం స్త్రీల మీద జరిగిన అమానుషత్వాన్నీ సమానమైనవని వాదించి గుజరాత్ బాధితుల అనుభవాన్ని అవమానించిన వారిని ఎవరూ పల్లెత్తుమాటెందుకు అనలేకపోయారు? మతోన్మాదులు కానివారూ నాస్తికులూ, మార్క్సిస్టులు సైతం ఇంత ముస్లిం వ్యతిరేకతని మనసులో పెట్టుకున్నప్పుడు దాచుకోవాలనే మొహమాటమైనా కనబరచనప్పుడు ముస్లిం సమాజం, నాయకులూ, మేధావులూ కనబరుస్తున్న ఆశాభావం చూస్తుంటే నిరాశ కలుగుతుంది. వారు ఏదో సామూహిక ఆత్మహత్యా వాంఛతో బాధపడుతున్నట్టుగా భయం కలుగుతుంది. అంటే దీనర్థం వ్యతిరేక భావాలు సరాసరిగా హత్యాకాండలకి దారితీస్తాయని కాదు. ద్వేషభావాల వలన మూకుమ్మడి హత్యాకాండలు జరిగిపోవు. వాటిని జరపడానికి నిర్మాణాలూ, సంఘాలు వారికి అడ్డుచెప్పకుండా తప్పుకునే మెజారిటీ జనమూ వారికి తగిన ప్రతిఘటన లేకుండా బలయిపోయే బాధితులూ కావాలి. వీటిలో దేనినీ ప్రగతిశీలవాదులూ మార్క్సిస్టులు సమకూర్చరు. వీలైనంతవరకూ అడ్డుపడటానికే నిస్సందేహంగా ప్రయత్నిస్తారు. కాకపోతే ప్రమాదస్థాయిని బాధితులు కాబోయేవాళ్లు గుర్తించకుండా ఉండటానికి ప్రగతిశీలవాదుల ధోరణులు కారణమవుతాయి. ఓ పక్క లక్షలకొద్దీ త్రిశూలాలు పంపిణీ అవుతుంటే, వాటిని వాడటానికి పెద్దఎత్తున శిక్షణ ఇస్తుంటే మన సెక్యులర్ వాదులు సంఘ్‌పరివార్‌ని ద్వేష ప్రచారం చేస్తున్నదని విమర్శిస్తారు. మంత్రులు వీధుల్లోకి వచ్చి జాతిమేధం జరిపించిన గుజరాత్‌లో ముఖ్యమంత్రే

హత్యాకాండని ప్లాన్ చేశాడని మాజీ బిజెపి మంత్రే ప్రకటించిన తర్వాత కూడా వీరు గుజరాత్ ప్రభుత్వం "సరైన చర్యలు తీసుకోలేదని" అంటారు. భౌతిక నిర్మూలనకి ఏర్పాట్లన్నీ చేస్తుంటే వీరు 'ప్రజలని విడదీస్తున్నార'ని ఆరోపిస్తుంటారు. బాధితులు సరైన ఆత్మరక్షణ ఏర్పాట్లు చేసుకోకుండా నివారించడం, తప్పుడు భద్రతా భావాన్ని సృష్టించడం లౌకికవాదులు ముస్లింలకీ క్రైస్తవులకీ చేస్తున్న ప్రత్యక్ష అపకారం. వీరు బోధించే శాంతి ప్రవచనాలని సంఘ్‌పరివార్ ఎలాగూ వినదు. బాధితులను నిరాయుధం చేయడమే వీరి శాంతి ప్రబోధాలు సాధించేదల్లా. మరోమాట స్ఫురించకా కొంత ఇప్పటికే ఈ మాట చెలామణిలో ఉన్నది కాబట్టి మైనారిటీ స్పృహ అనే మాట వాడుతున్నాను కానీ నిజానికి ఈ మాట తప్పుదోవ పట్టిస్తుంది. భారతదేశంలో ఏ ఎత్నిక్ బృందమూ మెజారిటీ కాదు. అందరూ మైనారిటీలే. సంఖ్యాపరంగా చూస్తే ముస్లింలు కాస్త పెద్ద సమూహమే అవుతారు, అనే మాట మైనారిటీ స్పృహ అనే మాటకి అర్థం 'మైనారిటీలమే అపోహ'. తాము అభద్రతలో ఉన్నామని గుర్తించినా ఆ అభద్రత తీవ్రతని గుర్తించని ముస్లిం మేధోనాయకత్వపు ఆలోచనలని 'స్పృహ' అనే మాటతో సూచించడం పొరపాటే అవుతుంది. ఇక్కడ అభద్రతా భావం అనే మాట గురించి కొంచెం చెప్పుకోవాలి. స్త్రీలకి రక్షణ లేదనీ, దళితులకీ రక్షణ లేదనీ ఆఖరికి ప్రజాప్రతినిధులకు రక్షణ కరువైందనీ మాట్లాడేవారందరూ ముస్లింల పరిస్థితి గురించి మాత్రం "అభద్రతా భావానికి గురవుతున్నార"ని అంటారు. అంటే ముస్లింల వరకూ వస్తే అభద్రత 'భావమై'పోతుంది. సమస్య ముస్లింల మనసుల్లోనే ఉందనే అర్థం సులువుగా వచ్చేస్తుంది. నిజానికి రాజ్యమే ముస్లింలని చంపడం మొదలుపెడితే అడ్డుకోవడానికి ఐక్యరాజ్యసమితి గానీ, అమెరికా గానీ ముందుకువస్తాయా, ముస్లింలని చంపే పార్టీలు అధికారంలోకి రాకుండా తిరుగులేని గ్యారంటీ ఏదైనా మన రాజకీయ వ్యవస్థలో ఉందా? అనే ప్రశ్నలు ముందు ముస్లిం మేధావులు వేసుకుని సంతృప్తికరమైన సమాధానం వెతుక్కుంటే మంచిది. ముస్లింల భద్రతకి ఉన్న పునాదులు ఎంత బలహీనమైనవో తెలిసిపోతుంది.

ఊహాతీతమైన విషయాలెన్నో చరిత్రలో జరిగాయి కానీ 'సాధ్యమైన' దారుణాలన్నిటికీ పాల్పడకపోవడం మానవ సమాజాలన్నిటికీ ఉన్న శాశ్వత లక్షణం. ఆ భద్రతకి మూలాలు మానవ స్వభావంలోనే ఉన్నాయి కానీ రక్షణ ఏర్పాట్లలో లేవు. అలాంటి రక్షణ ఏర్పాట్లు సాధ్యం కూడా కాదు. కొంతమందిలో కొంత కాలమైనా ఆ మానవ స్వభావాన్ని దారి మళ్ళించవచ్చు. క్రూరత్వానికి అవకాశంగా కాక ఒక ఆశయానికి అవసరంగా వ్యాఖ్యానించి నాటుకునేలా చేస్తే చాలు. తక్కిన ఎనభై ఐదుకోట్ల మంది ప్రాణాలకీ హామీ కల్పించగలిగితే పదిహేను శాతం మందిని హతమార్చడం ఒక రాజ్యానికి పెద్ద కష్టంకాదు. అంటే సంఘ్‌పరివార్ ఆశయాలని నిజం చేసుకోగలుగుతుందని కాదు. అసాధ్యమైన ఆశయాలని సాధించడానికి చేసే ప్రయత్నంలో ఊహాతీతమైన భారీ విషాదానికీ క్రూరత్వానికీ కారణమవుతుంది. ముస్లింలనీ, క్రైస్తవులనీ సమస్యగా తప్ప పౌరులుగానో, మానవులుగానో చూడలేని దాని తత్వం నిజంగా వీరందరినీ చంపుదామనుకుంటున్నదా లేదా అనేది అనవసరమైన ప్రశ్న. హిట్లర్ కూడా యూదులని చంపుదామని చాలా కాలం దాకా అనుకోలేదు. చరిత్రలో ఏ జాతివేధమూ మొదటి నుంచీ ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన దాఖలాలు లేవు. సంఘ్‌పరివార్ నిర్మించాలనుకుంటున్న కొత్త సమాజంలో వీరికి స్థానం లేదు. రానురానూ వారి ఆశయాలకి మైనారిటీలు 'ఉండటమే' సమస్యా, అడ్డంకీ అయిపోతుంది. పొరుగుదేశంతో యుద్ధమూ అత్యవసర పరిస్థితీ జాతీయోన్మాదమూ ముస్లింలు పాకిస్తాన్‌కి సహకరిస్తున్నారనే పుకారూ ఆ పైన పోలీసులూ సంఘ్‌పరివార్ మూకలూ 'దేశద్రోహుల'ని శిక్షించడమూ మొదలైతే ముస్లింలు లేని పవిత్ర ప్రక్షాళిత భారతదేశాన్ని నిర్మించుకోవడం పెద్ద కష్టంకాదని సంఘ్‌పరివార్‌లో ఉత్సాహవంతులకి అనిపిస్తుంది. తక్కిన ప్రపంచం ఊరుకుంటుందా అని ఎవరైనా తర్కించబోవచ్చు గానీ కేవలం కొన్ని వేలమంది కార్యకర్తలు గుజరాత్‌లో జరిపిన అకృత్యాలని కోట్లమంది తక్కిన భారతీయులు ఆపలేకపోవడం సరికదా తర్వాత దోషులని శిక్షించడం గానీ కనీసం బాధితులకి పునరావాసం గానీ కల్పించలేకపోయారని మరిచిపోనవసరం లేదు. ఈ మధ్య ఎరిక్ హాబ్స్‌బాన్ మనకి గుర్తు చేసినట్టుగా ఏ ప్రాంతంలోనైనా ఎంత విస్తీర్ణంలోనైనా ఏకైక సంస్కృతి ఉండే సమాజాన్ని నెలకొల్పడం అసాధ్యం. అలాంటి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కాకపోతే విఫలమవుతూ భారీ విషాదాలకి కారణమయ్యాయన్నది ఆయనకి తెలియని విషయం కాదు.

ఆ తర్వాత ఇక దళిత – మైనారిటీల సంబంధాలనే ప్రశ్నే ఉండదు. ఇక ఆధిపత్య కులాలతోనే దళిత జనానికి పోరాటం ఉంటుంది. కాకపోతే అప్పుడు దళితులది ఏకాకి పోరాటం, హిందూయిజం నుంచి విముక్తమయ్యే వీలు కోల్పోయి లోలోపలే చేయాల్సిన ఓడిపోయే యుద్ధం.

(జాన్‌వెస్లీ స్మృతికి అంకితం)

సామ్రాజ్యవాద దోపిడీకి మరోపేరే 'ప్రపంచీకరణ'

– వి. హనుమంతరావు

(గత సంచిక తరువాయి)

1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వం వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడాన్ని తగ్గించుకొన్నదని, ఇది మంచి పని కాదని ఆర్థిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం ఎందుకు పునరాలోచించుకోవటం లేదని గత పక్షం సంచికలో నేను ప్రశ్నించడం జరిగింది.

ఈ ప్రశ్నకు రెండు జవాబులు చెప్పవచ్చు. 1) దేశం ప్రధానంగా వ్యవసాయాధార దేశం కావటంతో రెండవ ప్రణాళిక కాలం నుంచి దేశాభివృద్ధిలో సమతుల్యత సాధించే ఉద్దేశ్యంతో పరిశ్రమలకు పెద్దపీట వెయ్యటం జరిగింది. వ్యవసాయాన్ని అమెరికా సూచించిన టెక్నాలజీ ద్వారా అధిక పంటలు పండించవచ్చుననే పరిష్కారానికి వదిలిపెట్టేసింది. పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఇచ్చినా, ప్రైవేటు రంగం పరిశ్రమల అభివృద్ధికి కావల్సిన పెట్టుబడులను పెట్టే స్థోమత, శక్తిలేనిది కావటంతో, ప్రభుత్వరంగంలోనే పరిశ్రమలు స్థాపించాలనే నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వరంగ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చిందంటే ఆ సిద్ధాంతాన్ని నమ్మటంవల్ల కాదు, స్వదేశీ పెట్టుబడిదారులకు వత్తాసు ఇచ్చే ఉద్దేశ్యంతోనేని గ్రహించాలి. అదే సమయంలో ప్రైవేటు రంగానికి విదేశాల పోటీ నుంచి రక్షణ కల్పించింది. కాపిటల్ గూడ్స్ తయారు చేసే పరిశ్రమలకే ప్రాధాన్యత ఇచ్చి, కాపిటల్ గూడ్స్‌ను విదేశీ యంత్రాల కన్నా తక్కువ ధరలకు దేశీయ పెట్టుబడిదారులకు అందచేసింది. కాగా పారిశ్రామికీకరణకు పునాదులు వేసినా, అదే సమయంలో పెట్టుబడిదారీ విధాన ప్రవేశానికి కూడా మార్గం సుగమమైంది. ఈ విధానం వల్ల ప్రభుత్వాధినేతలకు, బ్యూరాక్రసీకి, టాటా, బిర్లాల్లాంటి పారిశ్రామికవేత్తలతో సంబంధాలేర్పడ్డాయి. అప్పటి నుంచి ఈనాటి వరకు పారిశ్రామిక లాబీయే ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయటంతో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వకపోవటం జరిగింది. భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి మాత్రం ప్రాధాన్యతనిచ్చింది. వంటనూనెలు, వస్త్ర పరిశ్రమలు, పంచదార పరిశ్రమలాంటి వ్యవసాయాధార పరిశ్రమలకు అవసరమైన మేరకు వ్యవసాయంపై శ్రద్ధ పెట్టింది. నిన్న మొన్నటి వరకూ వ్యవసాయ విధానపత్రమే తయారుచేయలేదంటే, వ్యవసాయాన్ని మొదటి నుంచి ఎలా గాలికి వదిలివేసిందో అర్థమవుతోంది. ఇపుడు కూడా ఆ పత్రం తయారైందంటే, దానికూడా ఓ కారణం వుంది.

2) అదే ప్రపంచబ్యాంకు విధానాలు, షరతులు. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన 1991లోనే వ్యవసాయ విధానం గురించి కూడా ప్రపంచబ్యాంకు ఓ పత్రాన్ని భారత ప్రభుత్వానికి అందచేసింది. అయితే సంస్కరణలు మొదటి దశకంలో ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ మీదే దృష్టి కేంద్రీకరించి, భారత ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసేలా, అలాగే ద్రవ్యలోటు తగ్గించటం మీద దృష్టి సారించడానికే ప్రపంచబ్యాంకు, వ్యవసాయరంగ సంస్కరణలను పక్కనపెట్టి, ఇపుడు రెండవ విడత సంస్కరణల్లో ఫైనాన్షియల్ సెక్టర్‌కు, వ్యవసాయరంగ సంస్కరణలకు ప్రాధాన్యతనిచ్చింది. ఈ ప్రాధాన్యత ఫలితమే భారత ప్రభుత్వ వ్యవసాయ విధాన ప్రకటన, ప్రపంచబ్యాంకు షరతులన్నీ ప్రపంచీకరణ విధానంలో భాగమే. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రపంచబ్యాంకు ఏజెన్సీ ఎలా తీసుకున్నారో, ప్రపంచీకరణ ఏజెన్సీని ప్రపంచబ్యాంకు తీసుకొని, తాను ఇచ్చే రుణ సహాయానికి ప్రపంచీకరణ విధానాలకు లంకెపెట్టింది.

1. తిండిగింజలకన్నా, వ్యాపార పంటలు, ఎగుమతులకు అవసరమైన పంటలు పండించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. తిండిగింజలు దిగుమతి చేసుకోవచ్చు.
2. వ్యవసాయానికిచ్చే సబ్సిడీలను తగ్గిస్తూ ఆఖరుకు రద్దు చేయాలి.
3. వ్యవసాయ ఉత్పత్తుల, ఎగుమతుల మీద ఎటువంటి ఆంక్షలు విధించరాదు. అలాగే దిగుమతుల మీద కూడా ఆంక్షలుండరాదు.

కాంట్రాక్టు వ్యవసాయం, ఎక్కువ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు, నూనెగింజలు, పత్తి, పండ్ల మార్కెట్ ఏర్పాట్లు, పెద్దసైజు భూకమతాలు, వ్యవసాయ వ్యాపారం, భూములు ప్రైవేటుగా లీజుకివ్వడానికి కావాల్సిన చట్టసంబంధమైన చర్యలు తీసుకోవాలి. ఇది చిన్న, సన్నకారు రైతులను వారి భూముల్లోనే వ్యవసాయ కూలీలుగా మార్చటం, కార్పొరేట్ సంస్థలకు, బహుళజాతి సంస్థలకు భూమిని ఆచరణలో దఖలుపరచటం తప్ప మరేమీ కాదు. సాంకేతిక పరిజ్ఞానం బదలాయించాలి అంటే ఏ టెక్నాలజీనైతే భారత రైతాంగం కొన్ని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయో, ఆ మాన్‌సాంటో టెక్నాలజీ దిగుమతి చేయటమే.

ప్రస్తుతమున్న ప్రభుత్వ మార్కెట్ యార్డుల స్థానే ప్రైవేట్ రంగం

మార్కెట్లో అనుమతించాలి. ఆహార భద్రత కోసం అధిక పంటలు పండించడం, దిగుబడులను పెంచటం కాదు, తిండిగింజలను దిగుమతి చేసుకోవాలి.

ప్రపంచవ్యాపితంగా పేరుపొంది, గుత్తాధిపత్యం సంపాదించిన విత్తనాల కంపెనీల ద్వారా విత్తనాలు సరఫరా. ప్రస్తుతం రైతులు విత్తనాల కోసం కొంత ధాన్యాన్ని పక్కనపెట్టి తరువాత సీజన్లో ఉపయోగించుకొనే విధానం స్థానే ప్రతి సంవత్సరం విత్తనాలు కొనుక్కోవాల్సిన విధానాన్ని ప్రవేశపెట్టాలి. కొన్ని రకాల విత్తనాలను యూరోపియన్ దేశాల్లో ప్రవేశపెట్టడానికి నిరాకరించగా, వాటినే అభివృద్ధి చెందుతున్న దేశాలనెత్తిన రుద్దుతున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే 1)వ్యవసాయం నుంచి చిన్న, సన్న వ్యవసాయదారులను దూరం చేసి వారిని వారి భూముల్లోనే కాంట్రాక్టు వ్యవసాయం పేరుతో, కూలీలుగా మారుస్తున్నారు. 2)కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు వ్యవసాయరంగంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. 3)విత్తనాలకోసం కూడా విదేశీ సంస్థల మీద ఆధారపడేలా చేస్తున్నారు. 4)సబ్సిడీలను ఇంత కుదించడం ద్వారా వ్యవసాయదారుని పొట్టకొడుతున్నారు. 5)అందువల్ల వ్యవసాయ ఖర్చులు పెరిగి, రైతులు వ్యవసాయ రంగం నుంచి నిష్క్రమణకు పునాదులు వేస్తున్నారు. 6)తిండిగింజలు పండించడానికి బదులు, ఎగుమతులకు అనువుగా వుండే పంటలు పండించాలంటున్నారు. 7)తిండిగింజలను విదేశాలనుంచి దిగుమతి చేసుకోమంటున్నారు. 8)మార్కెటింగ్ యార్డుల స్థానే ప్రైవేటు రంగానికి మార్కెట్‌ను ధారాదత్తం చేయమంటున్నారు. 9)ఆహార భద్రత వూసే లేదు. పైగా వ్యవసాయాన్ని ఒక వ్యాపారవ్యాపకంగా మార్చివేస్తున్నారు. ఇవన్నీ ప్రపంచీకరణవాదుల లక్ష్యాలు కాగా, వాటిని ప్రపంచబ్యాంకు భారత ప్రభుత్వం నెత్తిన రుద్ది, దేశ వ్యవసాయ విధానపత్రంలో చేర్చారు. ఈ విధానాన్ని కొనసాగిస్తే, చంద్రబాబు అన్నట్లు, రైతుల సంఖ్యను గ్రామీణ జనాభాలో 35 శాతానికి తగ్గించేయటం జరుగుతుంది. నూటికి 69మంది గ్రామీణ ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడే దేశంలో వారిలో సగం మందిని వ్యవసాయం నుంచి తప్పిస్తే, వారెలా బతుకుతారు? కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు రంగప్రవేశం చేస్తారు కాబట్టి, వారు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఎవరైనా వాదించవచ్చు కాని, వాస్తవంలో జరిగేదేమంటే, వాళ్లు వ్యవసాయాన్ని యాంత్రీకరణ చేస్తారు కాబట్టి, ఉపాధి అవకాశాలను అవసరమైన మేరకు కల్పించలేరు. కుంటో, సెంటో భూమి వుండి, కనీసం తిండిగింజలైనా పండించుకొని ఆహార భద్రతను సమకూర్చుకొనే కాస్త ఆశ చేయిజారిపోతుంది. గ్రామాలు కళకళలాడవచ్చు కాని గ్రామీణుల జీవితాలు గొర్రె తోక బెత్తెడుగానే ఉండిపోతాయి.

అంతేకాదు, వ్యవసాయ ఉత్పత్తులకు, ప్రాసెస్డ్ ఫుడ్స్ దిగుమతులకు దేశం ద్వారాలు బార్లా తెరిచారు. 70వ దశకం నుంచి ఎంతో కొంత స్వయంపోషకత్వాన్ని ఆహారరంగంలో సాధించామనుకొంటే అది కాస్తా ఎగిరిపోతుంది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను రద్దుచేసే దిశగా పావులు కదుపుతున్నారు. ఇది జరిగితే కనీస ధరా వుండదు, ప్రొక్యూర్‌మెంటూ వుండదు, చవక ధరల దుకాణాలూ ఉండవు. ప్రజల జీవితాలతో ప్రైవేటు వ్యాపారస్తులు ఆడుకుంటారు. ఇప్పటికే 1500 వస్తువులు, ఉత్పత్తుల దిగుమతుల మీద పరిణామాత్మక ఆంక్షలను ఎత్తివేసిన ఫలితంగా వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఫుడ్స్ దిగుమతులు పెరిగాయి. వీటిని ఎగుమతి చేసే దేశాల్లో పీకలదాకా సబ్సిడీలు ఇస్తుండడంతో వాటిని చవక ధరలకు అమ్ముతున్నారు; భారత రైతు ఈ పోటీకి తట్టుకోలేకపోతున్నాడు.

మనదేశంలో సబ్సిడీల వ్యవస్థను రద్దుచేయమని ఒత్తిడి తెస్తుంది ప్రపంచబ్యాంకు. కాని అభివృద్ధి చెందిన దేశాల్లో ఉదాహరణకు ఒ.సి.ఇ.డి (24 దేశాల కూటమి) దేశాల్లో 2001 సంవత్సరంలో 327 బిలియన్ డాలర్లు సబ్సిడీలు వారి రైతులకు ఇచ్చారు. ఆ 24 దేశాల్లో ఉత్పత్తి ఖర్చులో 80 శాతం సబ్సిడీయే. అమెరికాలో ఈ సబ్సిడీ హెక్టారుకు 550 డాలర్లు (రు.24,750లు). ఆ ఒక్క దేశంలో ఇచ్చిన మొత్తం సబ్సిడీ 97.3 మిలియన్ డాలర్లు. అంటే మన దేశంలో అన్ని ఆహారపంటల విలువ ఎంత వుందో అంతకన్నా ఎక్కువ. ఇలా చేయటం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పడిపోతాయి. అది మన రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీస్తుంది.

ప్రపంచబ్యాంకు గణాంక సమాచారం ప్రకారం 1999-2001 మధ్యకాలంలో కొబ్బరినూనె ధర టన్నుకు 737 డాలర్ల నుంచి 318 డాలర్లకు, పామాయిల్ 436 నుంచి 1373కు, టీ 2068 నుంచి 1661కు (అన్నీ డాలర్లలో) పడిపోయాయి. 1999 ముందు సంవత్సరాల్లో కూడా కొన్నిటి ధరలు పడిపోతూ వచ్చాయి. రెండు సంవత్సరాల క్రితం మనదేశంలో ఆరుకోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు మేటవేసుకుపోతే, గబగబా ఆ ధాన్యాలను మన రేషన్ షాపుల్లో మనకమ్మే ధర కన్నా తక్కువ ధరకే ఇతర దేశాలకు ఎగుమతి చేయాల్సి వచ్చిందన్న విషయం, అంతర్జాతీయంగా ధరలు పడిపోవటం మన దేశాన్ని ఎలా ప్రభావితం చేయగలదో అన్న విషయాన్ని గమనించాలి. ఇలా ధరలు పడిపోవటం మంచిదేగా అనే అభిప్రాయం కొంతమందిలో ఉంది. కాని ఇది వాస్తవ వ్యతిరేకం. ధరలు పడిపోవడాలు టోకు మార్కెట్లోనే, వినిమయదారుల మార్కెట్లో కాదు. వ్యవసాయం మీద పెట్టుబడులను ఈ నేపథ్యంలో తగ్గించటం గమనార్హం. అందుకు సంబంధించిన సమాచారాన్ని వచ్చే సంచికలో విశ్లేషించుకొందాం. ○

రాష్ట్ర విద్యారంగ స్థితిగతులు - నిజానిజాలు

- కె. లక్ష్మినారాయణ
రీడర్, సెంట్రల్ యూనివర్శిటీ
ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటి

గత డిసెంబర్, 2003న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక విద్యా సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి 2005 నాటికల్లా సంపూర్ణ అక్షరాస్యతను సాధించే లక్ష్యం మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌ను విజ్ఞాన సమాజంగా తీర్చిదిద్దాలని ఉన్నదని అన్నారు. ఈ ప్రకటనలు వింటే, ఈ రెండు లక్ష్యాలను సాధించటానికి ఎదురయ్యే నిర్దిష్ట సమస్యలు గుర్తించినట్టూ, కొన్ని నిర్దిష్ట చర్యలు ఇప్పటికే తీసుకున్నట్లు నమ్మబలుకుతున్నాడు. కాని వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా వున్నాయి.

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రం (ఆర్టికల్ 45)లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్ళలో 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికి నిర్బంధోచిత ప్రాథమిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే అంతర్జాతీయ ఒప్పందాలపై సంతకాలు చేసి తద్వారా స్వీకరించిన బాధ్యతలను కూడా చూస్తే అందరికీ విద్యా హక్కును ప్రాథమిక స్థాయిలో కల్పించడం, ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తేవడం ప్రభుత్వం ప్రధాన బాధ్యత అని తేటతెల్లమవుతుంది. 1986 జాతీయ విద్యా విధానంలో కుల, మత, రంగు, ఆడ-మగ తేడా లేకుండా అందరికీ విద్యావకాశాలు కల్పించాలని రాసుకొన్నారు. 2000 సంవత్సరంలోగా అందరికీ విద్య అన్నారు. 2002లో 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పిల్లలందరికీ ప్రాథమిక విద్యా హక్కు ఉందని పార్లమెంట్ కొత్త రాజ్యాంగ నియమాన్ని చేర్చింది. 2003 సంవత్సరంలో ఉచిత నిర్బంధ విద్యా బిల్లును పరిమితమైన చర్యకు పెట్టారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెడ్తామని అంటున్నారు. గత ఐదు దశాబ్దాలు ఇటువంటి మాటలు చెబుతూ ప్రభుత్వాలు తమ పబ్బం గడుపుకుంటున్నాయి.

అందరికీ విద్య-ప్రభుత్వానిదే ప్రధాన బాధ్యత.

గత 9 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం ప్రాథమిక విద్యను మెరుగుపరచడానికి చేసిందేమి లేదు. పైగా "అందరికి విద్య - మనందరి బాధ్యత" అని అంటూ ఒక డాక్యుమెంట్‌ని విడుదల చేసి, తన ప్రభుత్వం ప్రధాన బాధ్యత మాత్రమే కాదని చెప్పకనే చెబుతున్నారు. ఇప్పుడు అందరికి విద్య విడిచి పెట్టి సంపూర్ణ అక్షరాస్యత అంటున్నారు.

అంటే ప్రజలకి నాలుగు అక్షరాలు వస్తే చాలు వస్తువుల పేర్లు చదువుతారు. ఏ బస్సు, ఏ ఊరికిపోతుందో తెలుసుకోగలుగుతారు. వ్యాపార ప్రకటనలు చదువగలుగుతారు. అశేష ప్రజానీకాన్ని విద్యకు దూరం చేసి అక్షరాస్యులుగా ఉంచడమనేది మార్కెట్టు శక్తుల భావన. అందుకే ఒకపక్క ప్రభుత్వ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు తరగతి గదులు, బెంచీలు లేక చెట్ల కింద, బండలమీద కూర్చుంటే ఇంకొక పక్క ఇంటర్నేషనల్ స్కూళ్ళు, ఎయిర్‌కండిషన్డ్ స్కూళ్ళు, తరగతి గదులు, ఎయిర్‌కండిషన్డ్ బస్సులు ధనిక వర్గాల పిల్లలకు ఇవ్వబడుతున్నాయి. ఇటువంటప్పుడు అక్షరాస్యత అనేది వయోజనలకు మాత్రమే అని బడి ఈడుగల బాలబాలికలకు కావలసింది ప్రాథమిక విద్య అని, అది ప్రభుత్వ బాధ్యత అని నొక్కి చెప్పవలసి వుంది. అందరికి అందించాలంటే బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలనేది ప్రాథమిక అంశం.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించకుండా అందరికి విద్య అసాధ్యం

ఇప్పటికీ మన రాష్ట్రంలో పసులగాసే పిల్లవాళ్ళు, పాల బుగ్గల జీతగాళ్ళు తల్లిపాలు మరవకముందే పంట పొలాల్లోనూ, అటవీ ఉత్పత్తులను సేకరించడంలోనూ, హోటల్లో, మెకానిక్ గ్యారేజీలలో, తివాసీల తయారీలో, చిన్న మధ్య తరహా పరిశ్రమలల్లో అనారోగ్యకరమైన వాతావరణంలో 32 లక్షలకు పైగా బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ లెక్కలు కూడా రాష్ట్రంలో 19 లక్షల నుంచి 25 లక్షల వరకు బాలకార్మికులున్నారని చెబుతున్నాయి. ప్రపంచంలో అత్యధిక బాలకార్మికులున్న దేశం భారతదేశం. అందులో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ బాలకార్మికులున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. బడి ఈడుగల పిల్లలు పాఠశాలలో లేకపోతే వారిని బాలకార్మికులుగా గుర్తించాలని అందరూ అంగీకరిస్తున్నారు. బాలకార్మికత తీవ్రమైన సమస్యగా అందరూ ఒప్పుకుంటున్నారు. బాలకార్మికత ప్రధానంగా రెండు కారణాల నుండి పుట్టుకొస్తుంది. బాలబాలికల కుటుంబ పేదరికం ప్రధాన కారణం కాగా, పాఠశాల పరిస్థితి మరొక కారణం.

> **వ్యవస్థ మార్పుకోసం జరిగే పోరాటాల గురించి పడిగాపులు పడి వేచిచూస్తూ కాలం వెళ్లబుచ్చనక్కర్లేదు. అలాగని బాల కార్మికతను పేదరికం కాదని, తల్లిదండ్రులలో చైతన్యం లేకపోవడం ప్రధాన కారణమని ఆ చైతన్యం కొరకు ప్రభుత్వం చేసే టీవీ, రేడియో, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా చేసే ప్రచార ఆర్భాటంలో కలవవలసిన అవసరం అంతకన్నా లేదు. విద్యారంగం అవతల పేదరికానికి వ్యతిరేకంగా కనీస వేతనాలు సమాన పనికి సమాన వేతనం ప్రతి కుటుంబానికి భూమి, మొదలగు ఉత్పాదక ఆస్తులు లాంటి డిమాండ్లపై జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్ష మద్దతు ఇస్తూనే విద్యారంగంలో కుటుంబ పేదరికాన్ని ఎదుర్కొనే మార్గాలు ఎదుర్కోవాలి.**

కుటంబ పేదరికం :

బాలకార్మికతకు మూలకారణం కుటుంబ పేదరికం. బాలకార్మికతను నిర్మూలించకుండా అందరికీ చదువు అనేది ఒట్టి భ్రమ. దీనర్థం ఈ వ్యవస్థ దోపిడి వ్యవస్థ కాబట్టి పేదరికం ఈ వ్యవస్థలో

అంతర్భాగం కాబట్టి, అందరికీ విద్య సాధించాలంటే పేదరికాన్ని నిర్మూలించకుండా సాధ్యం కానేకాదు. పేదరికం నిర్మూలనకు వ్యవస్థలో మౌలిక మార్పులవసరం.

వ్యవస్థ మార్పుకోసం జరిగే పోరాటాల గురించి పడిగాపులు పడి వేచిచూస్తూ కాలం వెళ్లబుచ్చునక్కర్లేదు. అలాగని బాల కార్మికతను పేదరికం కాదని, తల్లిదండ్రులలో చైతన్యం లేకపోవడం ప్రధాన కారణమని ఆ చైతన్యం కొరకు ప్రభుత్వం చేసే టీవీ, రేడియో, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా చేసే ప్రచార ఆర్భాటంలో కలవవలసిన అవసరం అంతకన్నా లేదు. విద్యారంగం అవతల పేదరికానికి వ్యతిరేకంగా కనీస వేతనాలు సమాన పనికి సమాన వేతనం ప్రతి కుటుంబానికి భూమి, మొదలగు ఉత్పాదక ఆస్తులు లాంటి డిమాండ్లపై జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్ష మద్దతు ఇస్తూనే విద్యారంగంలో కుటుంబ పేదరికాన్ని ఎదుర్కొనే మార్గాలు ఎదుర్కోవాలి. కుటుంబ పేదరికం ఎక్కువగా వుండి చేయటానికి పని లేక లక్షలాది కుటుంబాలు పని దొరుకుతుందన్న ప్రదేశాలకు, పట్టణాలకు వలస పోతున్నారు. వారికి చాలినంత కూలి రాక నిర్దిష్ట పని గంటలు లేక ఆ కుటుంబంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ కుటుంబాలలో పిల్లల ఆలనా, పాలనా పట్టించుకునే వారే లేరు.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలైన అమెరికా, బ్రిటన్, లాంటి దేశాల్లో మనలాగ సంపూర్ణ పేదరికం లేదు. సాపేక్ష పేదరికం వుంది. దానికి ఆ దేశ ప్రభుత్వాలు కామన్ స్కూల్ విధానం, నైబర్‌హుడ్, కాంప్రహెన్సివ్ పాఠశాలల ద్వారా దనికులు, పేదలు అనే తారతమ్యం లేకుండా ఉచిత పాఠశాల విద్యను ఇప్పటికీ అందిస్తున్నాయి. ఈ విధానాల వలన అందరికీ పాఠశాల విద్య అందించడమే కాకుండా పిల్లలలో సమానత్వ భావన, ప్రజాస్వామ్య లక్షణాలు అలవడుతాయి. అమెరికా నుంచి అన్నీ అరువు తెచ్చుకునే రాష్ట్ర ప్రభుత్వం, దాని కిరాయి మేధావులు ఈ విషయాన్ని కావాలనే పట్టించుకోవడం లేదు.

విద్యారంగంలో పేదరికం నుండి తలెత్తే సమస్యలను ఎదుర్కొనే ఇంకొక తక్షణ మార్గం పిల్లల్ని కుటుంబ పేదరికం నుండి విడగొట్టడం. పేద కుటుంబాల పిల్లల్ని బాలకార్మికత నుండి విముక్తి చేసి ప్రమాణాలు గల పాఠశాల విద్య వారికి అందించాలి. అందుకోసం ప్రారంభంలో ప్రభుత్వం మండలానికో రెసిడెన్షియల్ పాఠశాలను స్థాపించి క్రమంగా ఆ మండలంలో బాలకార్మికతను నిర్మూలించడానికి ఎన్ని అవసరమైతే అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు తెరవాలి. ఈ పాఠశాలల్లోని బాలబాలికలయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరించాలి. ఈ పిల్లలకు పాఠ్యపుస్తలకు, నోటు పుస్తకాలు, స్కూలు యూనిఫాం, పాలు, గుడ్లు, వంటి పోషకాహారం, వైద్యసేవలు, పాఠశాల ద్వారానే అందించాలి. ఈ బాలబాలికల తల్లిదండ్రులకు నష్టపరిహారం విధిగా చెల్లించాలి.

పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడమే మధ్యలో బడిమానివేయడానికి ప్రధాన కారణం

బడి ఈడుగల బాలబాలికలకి నివాసముండే చోటు 1 కి.మీ. లోపు స్కూలు వుంటే వారికి స్కూలు అందుబాటులో ఉంటుందని అంటారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన ఇప్పటికే స్కూళ్ళు అందుబాటులో లేవు. అఖిల భారత విద్యా సర్వేలో 1993లో వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటికే మొత్తం జనాభాలో 7% మందికి ఒక కి.మీ. లోపున పాఠశాల లేదు.

ఇప్పటికీ 82% షెడ్యూల్డు తెగల జనాభాకి 97% షెడ్యూల్డు కులాల జనాభాకి స్కూళ్ళు ఒక కి.మీ. లోపు లేవు. ఉన్న పాఠశాలల్లో కనీస వసతులు లేవు. రాష్ట్రంలో 20% ప్రాథమిక పాఠశాలలకు పక్కా భవనాలు లేవు. దాదాపు 40% సింగిల్ టీచర్ పాఠశాలలే (ఎనాలసిస్, మాసపత్రిక డిసెంబర్ 2003) అంటే ఇప్పటికి తరగతి ఒక గది, గదికొక్క ఉపాధ్యాయుడు ఉండాలన్న కనీస అవసరం తీరలేదు. ఇంకా బెంచీలు, నల్లబల్లలు కనీస స్థాయిలో కూడా లేవు. కేవలం 30% స్కూళ్ళలో మాత్రమే మంచినీటి సదుపాయం కలదు. కేవలం 14% స్కూళ్ళలో మాత్రమే మూత్రశాలలు వున్నాయి. (ఎనాలసిస్ మాసపత్రిక డిసెంబర్ 2003) వీటితో పాటు అవసరమైనంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం ప్రత్యేకంగా ఇంగ్లీషు, సైన్సు, హిందీ, లెక్కల సబ్జెక్టులలో టీచర్స్ లేకపోవడం వలన పాఠశాల విద్య ఫలవంతం కావడం లేదు.

విద్యార్థి ఉపాధ్యాయుల నిష్పత్తి వివిధ కమిటీలు సిఫారస్సు చేసినట్లు 30:1కి తగ్గించే బదులు తెలుగుదేశం ప్రభుత్వం 774 ఉత్తర్వును విడుదల చేసి 50:1కి పెంచింది. అవసరమైనంత మంది ఉపాధ్యాయులను రెగ్యులర్ ప్రాతిపదికపై నియమించకుండా విద్యా వాలంటీర్లను నియమిస్తుంది. విద్యా వాలంటీర్లు ప్రభుత్వంచే నియమించబడిన వాళ్ళు కాదు. విద్యా కమిటీలు నియమించాయి. నెలకు వెయ్యి రూపాయలు మాత్రమే పొందుతూ, ఉద్యోగ భద్రతలేని, సేవానియమం లేని, ఈ విద్యావాలంటీర్లు విద్యార్థులపై ఎంత దృష్టి పెట్టగలరు. పాఠశాలలో మౌలిక సదుపాయం లేకపోవడం వలన అవసరమైనంత మందికి అర్హత కలిగిన రెగ్యులర్ టీచర్‌లు లేకపోవడం వలన స్కూళ్ళలో చేరిన విద్యార్థులలో 55% మంది మధ్యలోనే బడి మానివేస్తున్నారు.

మధ్యలో బడిమానివేయటానికి మరో కారణం విద్యార్థుల కుటుంబ ఆర్థిక పరిస్థితే. మధ్యలో బడి మానివేసిన పేద కుటుంబాల పిల్లలు కొత్తగా బాల కార్మికులుగా మారకుండా ఉండడానికి, వారికి ఉచితంగా పుస్తకాలు, నోటు పుస్తకాలు, వైద్య సేవలు ప్రభుత్వమే అందించాలి. ఇటువంటి పేదకుటుంబాల పిల్లల్ని గుర్తించి వారికోసం మూడవ తరగతి నుండే చాలినన్ని రెసిడెన్షియల్ స్కూళ్ళను స్థాపించి విద్యను అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రజలందరికి పాఠశాలలను అందుబాటులోకి తేవడం, పాఠశాలల్లో మౌలిక సదుపాయం కల్పించడం, పేదవిద్యార్థులందరికి రెసిడెన్షియల్ స్కూళ్ళను స్థాపించడం, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని తగ్గించడం. తంగతిలో విద్యార్థుల సంఖ్య 30 దాటితే రేండవ సెక్షన్ ప్రారంభించి దానికి కూడా ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండేటట్లు చూడటం. విద్యా వాలంటీరు విధానాన్ని రద్దుచేసి అవసరమైనంత మంది ఉపాధ్యాయుల్ని రెగ్యులర్ ప్రాతిపదికపై నియమించడం మొదలైన నిర్దిష్ట చర్యలు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేపట్టడం లేదు? దీనిని బట్టి చూస్తే

కనీసం విజన్ డాక్యుమెంటులో ప్రాథమిక విద్యను ప్రభుత్వమే నిర్వహించాలని వాళ్లు రాసుకున్న దాని మీద కూడా చంద్రబాబు ప్రభుత్వానికి గౌరవం లేదనేది వెల్లడౌతుంది.

ఉన్నత విద్య నిరుద్యోగాన్ని సృష్టించదు. ప్రభుత్వ ఆర్థిక విధానాలే నిరుద్యోగాన్ని సృష్టిస్తున్నాయి.

ఇంటర్‌బోర్డుతో సహా వివిధ విద్యాబోర్డులు, విద్యారంగంతో సంబంధంలేని విద్యాప్రక్రియ గురించి తెలియని అధికారులచే నిర్వహించబడుతున్నాయి. ప్రధానంగా ఇంటర్మీడియెట్ బోర్డు అవినీతికి నిలయంగా మారిపోయింది. విద్యాబోర్డులకు, విద్యావేత్తలను అధిపతులుగా నియమించకుండా వీటి నుంచి మంచి ఫలితాలు ఆశించగలమా? ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో మౌలిక, సామాజిక, ప్రకృతి, భాషాశాస్త్రాలు బోధించబడుతున్నాయి. సామాజిక శాస్త్రాలు చదివిన వారికి ఉద్యోగాలు రావడం లేదని అందుకే వాటిని బోధించవలసిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొంతకాలం క్రితం ప్రకటించాడు. నిరుద్యోగం పెరగడానికి మూలకారణం విద్యావ్యవస్థ కాదని చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కై అమలు చేస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలని గట్టిగా నొక్కి చెప్పవలసి ఉంది. ఈ విధానాల వలన రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్ని, పరిశ్రమల్ని మూసివేదం వలన వందలు, వేలాది కార్మికులు ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయి చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇంతవరకు ఉన్న రక్షణలను తొలగించడం వలన లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండాపోయాయి. నిరుద్యోగానికి కారణం ఈ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని సామాజిక శాస్త్రాలు కావని చెప్పవలసి ఉంది.

అలాగే వృత్తి విద్యలు చదివితే ఉద్యోగాలు దొరుకుతాయని కూడా ముఖ్యమంత్రి అన్నారు. 1999 సం॥ చివరినాటికి వేలు, లక్షలాది మంది నిరుద్యోగులుగా ఉన్నారు. మన రాష్ట్రంలో మెడిసిన్ చేసిన వారు 2495 మంది, ఇంజనీరింగ్ చేసినవారు 18543 మంది, పాలిటెక్నిక్ చేసిన వారు 85,739మంది, ఐటిఐ చేసినవారు 2,50,151మంది నిరుద్యోగులుగా ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. (పట్టిక 1ని చూడండి) ఇంకా వృత్తినిపుణుల పరిస్థితి ఎంతగా దిగజారిందంటే ఈ మధ్య రైల్వే రిక్రూట్‌మెంట్‌వారు ప్రకటించిన 20వేల గ్యాంగ్‌మెన్ పోస్టులకు 60 లక్షల దరఖాస్తులు రాగా అందులో 25,000ల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్, 5,000ల మంది ఎంబిఎ చేసినవారి దరఖాస్తులు ఉండడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. **ఉద్యోగ ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం ప్రతి సంవత్సరం శ్వేతపత్రం ప్రచురించాలి.** రాష్ట్రంలో మెడిసిన్, ఇంజనిరింగ్, లా, బిఎడ్, ఎజిబిఎస్‌సి, బిఎస్‌సి (నర్సింగ్) వంటి ప్రొఫెషనల్ కోర్సులు వివిధ ట్రేడ్స్‌లో ఐటిఐ పూర్తిచేసిన వారు ఎంతమంది ఉన్నారు? ఇందులో సంఘటిత రంగంలో ఉద్యోగభద్రత లేకుండా కనీస వేతనాలు, పని పరిస్థితులు లేకుండా పనిచేస్తున్న వారెంతమంది? స్వయం ఉపాధి పొందిన వారెంతమంది? ఏదీ లేని నిరుద్యోగులెంత మంది?

అలాగే రాబోయే సంవత్సరాల్లో సంఘటిత, అసంఘటిత స్వయంఉపాధి రంగాలలో ఎంతెంత మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభ్యం కానున్నాయి. ఏయే రంగాలలో ఎంతెంత మంది నిపుణులు అవసరం అవుతారు? ఇపుడున్న ప్రొఫెషనల్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు, ఐటిఐలు కాక ఏయే వృత్తివిద్యలు చేసిన వారు ఇంకా ఎంతెంత మంది అవసరం? ఈ అన్ని వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్న మేరకు కొత్త కోర్సులను తయారుచేసే బాధ్యత అధికారం విశ్వవిద్యాలయాలకు ఉండాలి.

సెల్ఫ్ ఫండింగ్ కోర్సులు విద్యా వ్యాపారీకరణ

రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఒక మానవ వనరుల ప్రణాళిక అంటూ లేదు. పైగా ప్రభుత్వమే వృత్తి విద్యా కోర్సులపై భ్రమలను కల్పిస్తుంది. ఇంజనీరింగ్, డెంటల్, మెడికల్ కోర్సులపై కావాలని కల్పించబడ్డ భ్రమలను ఆధారం చేసుకుని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, అప్పోసొప్పో చేసి చదివించుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. అత్యధిక ఫీజులతో పేద, మధ్యతరగతి ప్రజలు ఈ చదువుకు దూరమయ్యాయి. కాగా పాలకపార్టీ నాయకులు ప్రైవేటు యాజమాన్యాల నుండి కోట్లాది రూపాయలు దండుకొంటూ విచక్షణారహితంగా కొత్త కళాశాలలకు అనుమతిస్తున్నారు. ఇటువంటప్పుడు ప్రైవేటు యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకువచ్చి అధిక ఫీజులను నియంత్రించి కళాశాలల్లో సరైన విద్యాప్రమాణాలు ఉండేటట్లు చూసే కనీస బాధ్యత ఈ ప్రభుత్వం నిర్వర్తిస్తుందా?

డిగ్రీ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఫ్యాషన్ టెక్నాలజీ, అడ్వర్టైజ్‌మెంట్ వంటి అనుచిత కోర్సులను ప్రవేశపెడుతున్నారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ పేరుతో విపరీతంగా ఫీజులు పెంచి, పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండా చేస్తున్నారు. అంతేకాకుండా, కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో, బోధన, బోధనేతర రంగాలలో ఏర్పడిన ఉద్యోగ ఖాళీలను నింపడం లేదు. కాంట్రాక్టు పద్ధతి మీద అధ్యాపకులను నియమించి ఒక రెగ్యులర్ అధ్యాపకునికి ఇచ్చే జీతంలో నాల్గవ వంతు జీతం మాత్రమే ఇస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేదు. సేవా నియమాలు లేవు. సమాన పనికి సమాన వేతనమనే సహజ న్యాయం లేదు. విద్యావాలంటీర్లలాగానే కాంట్రాక్టు లెక్చరర్లనేది ప్రభుత్వం సృష్టించిన ఒక వెట్టిచాకిరీ వ్యవస్థ. లౌకికవాదానికి కట్టుబడి ఉన్నామని చెప్పే తెలుగుదేశ ప్రభుత్వం భారతీయ జనతా పార్టీలో కుమ్మక్కైన తర్వాత జ్యోతిష్యం, కర్మకాండలను కోర్సులుగా ప్రవేశపెడ్తూ అమెరికాలో పురోహితులకు బాగా డిమాండు ఉందని వాదిస్తుంది. విజ్ఞానాన్ని వెదజల్లవలసిన విశ్వవిద్యాలయాలు మూఢనమ్మకాల కేంద్రాలుగా మారబోతున్నాయి. ఇలా విద్యా వ్యాపారీకరణ వలన అధిక ఫీజులు పెరిగి పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. విద్యా సంస్థల్లో కాంట్రాక్టు లెక్చరర్ల విధానాన్ని ప్రవేశపెట్టి వేలాది ఉద్యోగ ఖాళీలను నింపడం లేదు. ఈ వ్యాపారీకరణ వలన విద్యాసారం నాశనమౌతుంది.

విజ్ఞాన సమాజం అంటే ఏమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వానికి 2005

నాటికి ఆంధ్రప్రదేశ్‌ను విజ్ఞానసమాజంగా తీర్చిదిద్దాలని ఉందని చాలాసార్లు అన్నారు. విజ్ఞాన సమాజం అంటే ఏమిటో తన విజన్‌లో వివరించారు. ఆంధ్రప్రదేశ్ తన ప్రజలకు వివిధ రంగాల్లో మంచి నైపుణ్యం గల పునాదిని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలు కల్పిస్తుంది. దాని నుండి పరిశ్రమ పోటీతత్వం కలిగిన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తుంది. (విజన్ 2020) విజన్ ఉద్దేశంతో విజ్ఞాన సమాజం అంటే గుత్తపెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అవసరమైన కొద్దిమంది నిపుణులు గల సమాజం. విజ్ఞానాన్ని తిరస్కరించి నైపుణ్యాన్ని అందించి ఎదురు ప్రశ్నించని కొద్దిమంది మానవ యంత్రాలను తయారుచేయడమే విజన్ ఉద్దేశం. సిఇఒగా పేరు పొందిన ముఖ్యమంత్రికి విజన్‌ను రాసిపెట్టిన మెకన్సీ కంపెనీవాళ్లకు విజ్ఞాన సమాజం గురించి సమగ్రమైన అవగాహన అనేది అందని విషయం.

విజ్ఞాన సమాజం అంటే సమాజంలోని ప్రజలందరిని విజ్ఞానవంతులుగా తయారుచేయడమని చెప్పుకోవచ్చు. అటువంటప్పుడు బడి ఈడుగల బాలబాలికలందరికీ గుణాత్మకమైన పాఠశాల విద్య అందించగలగాలి. అంతేకాకుండా కనీసం సంబంధిత వయస్సు గ్రూపులో సగం మందైనా ఉన్నత విద్యను అభ్యసించిన వారై ఉండాలి. పాఠశాల విద్యను తీసుకుంటే ఆంధ్రప్రదేశ్ 2001 నాటికి భారతదేశం మొత్తం మీద కంటే తక్కువగా ఉండటం కాక మిగతా చాలా రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలకంటే వెనుకబడి ఉంది. మొత్తం 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ 28వ స్థానంలో ఉంది. ఇతర వెనుకబడిన దేశాలకంటే మన దేశం వెనుకబడి ఉంది. దేశంకంటే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది.

లౌకికవాదానికి కట్టుబడి ఉన్నామని చెప్పే తెలుగుదేశ ప్రభుత్వం భారతీయ జనతా పార్టీలో కుమ్మక్కైన తర్వాత జ్యోతిష్యం, కర్మకాండలను కోర్సులుగా ప్రవేశపెడ్తూ అమెరికాలో పురోహితులకు బాగా డిమాండు ఉందని వాదిస్తుంది. విజ్ఞానాన్ని వెదజల్లవలసిన విశ్వవిద్యాలయాలు మూఢనమ్మకాల కేంద్రాలుగా మారబోతున్నాయి.

ఇక రెండో అంగం సంబంధిత వయస్సు గ్రూపులో ఉన్న విద్య అభ్యసించిన వాళ్ల సంఖ్య, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి దేశాలైన అమెరికాలో 80.9% ఉంటే, బ్రిటన్‌లో 52.3 శాతం ఉంటే, ఇండియాలో 7 శాతం వరకు మాత్రమే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 6-7 శాతం వరకు మాత్రమే ఉంది.

వాస్తవానికి కనీసం ప్రతి ఇంట్లో ఒక గ్రాడ్యుయేట్ అయినా ఉండాలి. ప్రతి జనావాసంలో ప్రతి శాస్త్రానికి చెందిన కనీసం ఒక్కరైనా పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఉండాలి. 2005 నాటికి కాకపోయినా 2020 నాటికైనా ఇప్పటినుండి పుట్టిన ప్రతివారు ఎస్ఎస్‌సి లేదా హైయ్యర్ సెకండరీ పూర్తి చేయాలి. సంబంధిత వయస్సు గ్రూపులో 50% మంది గ్రాడ్యుయేట్స్ కావాలి. సంబంధిత వయస్సు గ్రూపులో కనీసం 25 శాతం పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కావాలి. ఇలా అయినపుడు మాత్రమే మన సమాజం విజ్ఞాన సమాజం కాగలదు.

జిల్లాకొక విశ్వవిద్యాలయం స్థాపించకుండా విజ్ఞాన సమాజం అసాధ్యం

విజ్ఞాన సమాజం నిర్మించాలంటే జిల్లాకొక విశ్వవిద్యాలయం ఎందుకంటే సాపేక్షికంగా మన జిల్లాలు చాలా పెద్దవి. ఒక్కొక్క జిల్లాలో సుమారు 20-30 లక్షల జనాభా ఉంటుంది. ఒక జిల్లాలో బాలకార్మిక విధాన నిషేధాన్ని అమలుపరచి బాలబాలికలకు పునారవాసం కల్పించే బాధ్యత, పాఠశాల ఉపాధ్యాయులకు ట్రైనింగ్ (డి.ఎడ్, బి.ఎడ్) ఇన్ సర్వీస్ ట్రైనింగ్ బాధ్యత, జిల్లాలో నిరక్షరాస్యత నిర్మూలన, జిల్లాలో నిరంతర విద్య నిర్వహణ, జిల్లాలో డిగ్రీ కాలేజీలు, మెడికల్ వంటి కళాశాలలు, పి.జి. డిప్లొమా కోర్సుల నిర్వహణ, పి.జి.కోర్సులు పరిశోధనా నిర్వహణల కోసం విశ్వవిద్యాలయం అవసరం. విశ్వవిద్యాలయం చేయవలసిన ఇంకొక ముఖ్యమైన పని జిల్లా చరిత్ర, రాజకీయ చరిత్ర, ఆంత్రోపాలజీ, భౌగోళిక లక్షణాల అధ్యయనం, మిన్యూల్స్, నీటివనరులు, బయో-డైవర్సిటీ, పొల్యూషన్ అడవుల పెంపకం - క్షీణత, పరిశ్రమలు-లేబర్ ఆర్గనైజేషన్, వ్యవసాయం-వ్యవసాయ మార్కెటు, మానవహక్కుల పరిస్థితి, మహిళా హక్కులు, కులవ్యవస్థ వంటి ఎన్నో సమస్యలపై అధ్యయనం చేయడం నిర్వహించడం, అన్ని పనులు చేయడానికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయం ఉండడం ఎంతైనా అవసరం. అట్టి విశ్వవిద్యాలయం జిల్లాకు ఒక మేథోకేంద్రంగా, విజ్ఞానరంగంలో ఒక దిక్సూచిగా, మానవ సంబంధాలపై ఒక తాత్పరిగా వ్యవహరించగలదు.

రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30% నిధులు విద్యకు కేటాయించాలి.

విద్యారంగం సమస్యలన లేవనెత్తినపుడల్లా ఆర్థికవనరులు లేవని ఖజానా ఖాళీ అయిందని ప్రభుత్వంకు పరిపాటి అయ్యింది. స్కాలర్‌షిప్‌ల కుంభకోణం, స్టాంపుల కుంభకోణం మరి ఇతర అనేక కుంభకోణాల్లో వేలకోట్ల రూపాయల డబ్బు కాజేశారు. విద్యారంగానికి మాత్రం వనరుల1 కొరత ఉంటుంది. ప్రభుత్వమే నియమించిన ఎన్నో కమీషన్లు, కమిటీలు ప్రధానంగా కొఠారి కమిషన్ విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30% కేటాయించాలని సిఫారసు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏ సంవత్సరమూ కనీసం 15% కూడా ఖర్చు పెట్టలేదు. ఫలితంగా పాఠశాల విద్య, ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఫలితాలనంతరం ఏర్పడబోయే ప్రభుత్వం ముందు నిర్దిష్టమైన విద్యారంగ సమస్యలను చర్చించి ప్రభుత్వ విధానంలో ప్రధాన అజెండాగా తీసుకురావడానికి విద్యయందాసక్తిగల సంఘాలు, మేధావులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యేక ప్రయత్నం చేయడం ఎంతైనా అవసరం.

('పీపుల్స్ ప్రోగ్రెస్ రిపోర్టులు' సౌజన్యంతో) ○

విద్యా సంబంధిత గణాంక పట్టిక గురించి 'రెండు రెళ్ళు నాలుగు'లో చూడండి

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672
DTP at: **AVM Graphics**, Vidyanagar; Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor** : V.Hanumantha Rao